సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 01.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 159
పేజీలు: 12 వెల: రూ. 5

నేటి నుంచే దేశ వ్యాప్త
# జనగణన
## ఏపీ, తెలంగాణ షెడ్యూల్ విడుదల

- డిజిటల్ రూపంలో 16వ జనగణన
- మీ వివరాలు మీరే నమోదు చేసుకోవచ్చు!
- మొదట 33 ప్రశ్నలతో గృహగణన.. తర్వాత జనాభా వివరాల నమోదు
- ఇంటి సౌకర్యాలు, ఆస్తులు, జీవన ప్రమాణాలపై దృష్టి
- సహజీవన జంటలకు 'కుటుంబ హోదా'!





**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
భారత్‌లో జనగణన ప్రక్రియ బుధవారం (ఏప్రిల్ 1న) ప్రారంభం కానుంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో జనగణన షెడ్యూల్ వివరాలను అధికారులు ప్రకటించారు. భారత చరిత్రలో మైలురాయిగా నిలిచే 16వ జనగణన (స్వతంత్ర భారతంలో 8వది) ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. జనగణన ప్రక్రియ 2 దశల్లో జరుగుతుందని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలి దశ అయిన గృహగణన ఏప్రిల్ 1వ తేదీన ప్రారంభం కానుంది. ఈసారి జనగణన పూర్తిగా డిజిటల్ రూపంలో జరగనుండటం విశేషం. పౌరులు అందించే వ్యక్తిగత డేటా అత్యంత మిగతా 02లో

పొలిటికల్
# డ్యామేజ్!?
## సొంత నేతల పైత్యం

అలవాటుగా మారుతున్న వివాదాలు

- డ్యామేజ్ కంట్రోల్ చేయడంలో గులాబీ దళపతి విఫలం?
- కౌశిక్ రెడ్డికి వివాదాలు అలవాటుగా మారాయా?
- బీఆర్ఎస్‌కు నష్టమా? లాభమా?




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
బీఆర్ఎస్‌కు సొంత నేతలే సమస్యలు సృష్టిస్తున్నారు. తమ రాజకీయ పైత్యాన్ని బహిరంగంగా ప్రదర్శించి విమర్శలు చేసుకుంటున్నారు. ఏదో చేస్తున్నామనే పాత కాలం అధికార అహంకారాన్ని ఇంకా చూపిస్తున్నారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఇటీవల అసెంబ్లీలో హరీశ్ రావు కూడా.. పొంగులేటిని టార్గెట్ చేస్తే అది రివర్స్‌గా గులాబీ దళాన్ని ఆగమాగం చే సింది. ఇదే తరహాలో కౌశిక్ రెడ్డి వ్యవహారం కూడా బీఆర్ఎస్‌కు రోజుకొక తల నొప్పి తెచ్చిపెడుతోంది.

**దూకుడే గండం**
కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ నుంచి ఆర్ఎస్‌లోకి చేరి, ఎమ్మెల్యే గా గెలిచిన తరువాత జరిగిన ఘటనల వల్ల పార్టీకి లాభం కంటే, నష్టమే ఎక్కువ. దూకుడు, ఆవేశం తప్పుకాదు, కానీ ఎక్కడ వాడాలో తెలియకపోవడం ముప్పు. తెలంగాణ రాజకీయాల్లో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీరు దుమారం 2025లో కరీంనగర్ కలక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజ య్ మాట్లడుతుండగా, నువ్వు ఏ పార్టీ ఎమ్మెల్యేవి చెప్పంటూ కౌశిక్ రెడ్డి మధ్యలో జోక్యం చేసుకోవడం, సంజయ్‌తో బాహాబాహీకి దిగడం వివాదంగా మారింది. తనపై కౌశిక్ రెడ్డి దాడి చేశాడంటూ ఎమ్మెల్యే సంజయ్ ఇచ్చిన ఫిర్యాదుతో సెక్షన్ 126, 115, 352, 292 కింద కేసు నమోదు చేసిన కరీంనగర్ పోలీసులు, హైదరాబాద్ వచ్చి కౌశిక్ రెడ్డిని బలవంతంగా అరెస్ట్ చేసి కరీంనగర్ స్టేషన్‌కు తరలించారు.

**నోరు జారడం.. అలవాటే..!**
ఓ గ్రానేట్ సంస్థ యజమానిని బెదిరించి 50 లక్షలు డబ్బు డిమాండ్ చేశారనే ఆరోపణలపై మిగతా 02లో

మసూద్ అజర్
## సోదరుడి హతం
మొహమ్మద్ తాహిర్ అన్వర్ అనుమానాస్పద మృతి




- భారత్ లో ఉగ్రదాడులకు రూపకర్త
- జైషే ఉగ్రవాద సంస్థలో కీలకనేత
- ధ్రువీకరించిన పాకిస్తాన్ 10

## ట్రంప్‌నకు షాకిస్తున్న యూరప్ దేశాలు
అమెరికాకు యూరప్ దెబ్బ




- వరుసగా గగనతల నిరాకరణలు
- యుద్ధానికి దూరంగా దేశాలు
- స్పెయిన్ బాటలోనే ఇటలీ 09
- సిసిలీ బేస్‌పై ఇటలీనో
- యుద్ధంలో జోక్యం వద్దన్న ఈయూ దేశాల స్పష్టమైన సందేశం

తెలంగాణపై
## క్యాన్సర్ పంజా
2026 చివరి నాటికి కొత్తగా 46,762 కేసులు



- మహిళల్లో ఎక్కువగా రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ముప్పు
- పొగాకు వాడకంతో పురుషుల్లో 58.8 శాతం కేసులు నమోదు
- నిర్ధారణ జాప్యంతో ప్రమాదకర పరిస్థితులు 09
- ఐసీఎంఆర్ నివేదికలో కీలక అంశాలు వెల్లడి

## టాలీవుడ్‌కు డ్రగ్ షాక్..
సినీ యాక్టర్లందరూ డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలి 03



- 90 రోజులకోసారి టెస్ట్.. నెగటివ్ వస్తేనే సినిమా రిలీజ్?
- టెస్ట్ చేయించుకోని వారు డ్రగ్స్ తీసుకున్నట్లే
- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

ప్రజాస్వామ్య పద్ధతిలో
## మూసీ పునర్జీవనం
డిప్యూటీ సీఎం భట్టి



- 15 రోజులపాటు ప్రజల అభిప్రాయాలను ఆన్ లైన్ లో నమోదు చేసుకుంటాం 09
- విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ
- అధికారులకు 24/7 మూసి సబ్ కమిటీ సభ్యులు అందుబాటులో ఉంటారు

## లొంగిపోని గణపతి
గడువు ముగిసినా దొరకని మావోయిస్టు మాజీ చీఫ్

లొంగిపోతే అన్ని రకాల ఆదుకుంటామని డీజీపీ ప్రకటన

గణపతి స్వగ్రామం జగిత్యాల జిల్లా బీర్పూర్ 02



శ్రీశైలంలో నీటి దోపిడీ
# ఆపండి
ఏపీ సర్కార్‌కు మంత్రి జూపల్లి వార్నింగ్

- రైతుల హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం
- జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా.. అక్రమ తరలింపుతో విద్యుత్ ఉత్పత్తి
- శ్రీశైలంలో తెలంగాణకు 64 శాతం నీటి వాటా 03



# పల్లెలకు మహర్దశ
## తెలంగాణ సహా 6 రాష్ట్రాలకు రూ. 1,500 కోట్లు

- 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్రం విడుదల
- తెలంగాణకు రూ. 247.94 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్స్




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు మంగళవారం రూ. 1,500 కోట్లకు పైగా గ్రాంట్లు విడుదల చేసింది. అయితే ఈ నిధులను జీతాలకు కాకుండా కేవలం అభివృద్ధి పనులకే వినియోగించాలని నిబంధన

# రేపటి నుంచి గ్రామసభలు
సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

- జూన్ 2 నుంచి అమలు చేయనున్న కొత్త పథకాలపైనా 02
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



## పాడి కౌశిక్ రెడ్డి చుట్టూ ఉచ్చు
వివాదాస్పద వ్యాఖ్యలతో చిక్కుల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యే
ఈ నెల 4న విచారణకు రావాలని సీఐడీ నోటీసులు 03



అకాల వర్షం..
## అపార నష్టం
జిల్లాలో 9393 ఎకరాల్లో పంట నష్టం 03
పంటల భీమా లేదు.. పరిహారం రాదు
ప్రభుత్వం దయపైనే ఆశలు

నిర్మాణం.. 02
# భారం
దేశవ్యాప్తంగా పెరిగిన సిమెంట్ ధరలు



ఇదీ ఏఐ
ముద్ర




ఎండాకాలంలో తెలంగాణలో అకాల వర్షాలు జనాలకు ఉపశమనం కల్పిస్తుండగా.. రైతులకు మాత్రం వారి పంటలు నాశనమై కన్నీళ్లు తెప్పిస్తున్నాయి..

## బలమైన పాస్‌వర్డ్‌లు వాడండి




అక్షరాలు, సంఖ్యలు, సింబల్స్ కలిపి సెట్ చేయండి. సింపుల్ పాస్‌వర్డ్‌లను పూర్తిగా నివారించండి.

# పొలిటికల్ డ్యామేజ్ !?




(మొదటి పేజీ తరువాయి)

జూన్ 1, 2025లో శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి విదేశాలకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేసి, ఎక్స్ టార్షన్ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అంతకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చీరా, గాజులు చూపిస్తూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఇటీవల స మక్క సారక్క జాతర జరుగుతున్న సమయం లో వీణవంక మండలంలోని సమ్మక్క జాతరకు కుటుంబ సమేతంగా వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన హంగామా అంతా ఇంతా కాదు, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారిని మతం పేరుతో దూషించాడంటూ పెను దుమారం రేగింది. అదే రోజు బలవంతంగా కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడం, రోజంతా హైడ్రామా కొనసాగింది. ఆవేశంలో మాట్లడాను, కావాలని మతం పేరుతో పోలీసు అధికారిని ధూషించలేదంటూ క్ష మాపణలు కోరుతూ మరుసటి రోజు వీడియో విడుదల చేయడంతో వివాదం కాస్తా తాత్కాలికంగా సర్దుమణిగింది. ఇలా ఒకటేమిటి హుజూరాబాద్ గడిచిన ఎన్నికల సమ యంలో కౌశిక్ రెడ్డి ఓట్లు అభ్యర్థించిన తీరు, కుటుంబ సమేతంగా విడుదల చేసిన వీడి యోలు రాజకీయంగా వివాదాలను తెచ్చిపెట్టాయి. బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్‌కు పార్టీ మారిన ఎమ్మెల్యేలు అరెకెపూడి గాంధీ, దానం నాగేందర్‌పై కౌశిక్ చేసిన వ్యాఖ్యలపై అంతే స్థాయిలో వాళ్లు స్పందించిన విధానం తిరిగి కౌశిక్ మెడకు చుట్టుకున్నాయి.

**బీఆర్ఎస్‌కు మైలేజ్ కన్నా.. డ్యామేజ్ ఎక్కువ!**


కండలు తిరిగిన శరీరాకృతితో కనిపించే కౌశిక్ రెడ్డి, హావభావాలు, మాట్లాడే విధానం, ఎదుటి వ్యక్తులతో దురుసుగా ప్రవర్తించిన తీరుతో అధికార కాంగ్రెస్ పార్టీ విసిగిపోయింది. అదును చూసి దెబ్బకొట్టింది. అసెంబ్లీ నుంచి సాగనంపేందుకు సిద్ధమైంది. అయితే బీఆర్ఎస్ మాత్రం తమ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దూకుడుతో పార్టీకి డ్యామేజ్ జరుగుతుందో, మైలేజ్ వస్తుందో, అర్థం కాని అయోమయంలో కనిపిస్తోంది. సమర్థిస్తే పరువు పోతుంది. వెనుకేసుకొస్తే జనం నవ్వుతారేమో అనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరి, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత జరిగిన వరుస ఘటనల వల్ల పార్టీకి లాభం కంటే, నష్టమే ఎక్కువ. దూకుడు తప్పుకాదు, ఆవేశం తప్పుకాదు, కానీ ఎక్కడ వాడాలో తెలియకపోవడం అతిపెద్ద ముప్పు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విషయంలో అదే జరుగుతోందంటున్నారు రాజకీయ విశ్లేకులు. విమర్శించడం, దాడి చేయడం, అరెస్ట్ అవ్వడం, నోరు జారడం, క్షమాపణలు చెప్పడం.. ఇలా కౌశిక్ రెడ్డికి గత కొంతకాలంగా అలవాటైపోయింది. ఈసారి అసెంబ్లీలో కడియంపై సైగలు చేసి అడ్డంగా దొరికేశాడంటున్న అధికార పార్టీ, భవిష్యత్‌లో మరెవరూ ఇలా మాట్లాడకుండా చేస్తామంటూ చెప్పిమరీ వేటు వేసేందుకు సిద్ధమైంది.

**దళపతికే గండం**

విపక్షంలో ఉన్న బీఆర్ఎస్.. తమ దూకుడు తమకు లాభమని భావిస్తుంటే.. ప్రజల్లో మాత్రం వ్యతిరేకతను పెంచుకుంటూ పోతోంది. తాజాగా హరీష్ రావు చేసిన మైనింగ్ మాఫియా వ్యవహారం మొత్తంగా గులాబీ నేతలకే చుట్టుకుంది. దానిని అధికారపక్షం వైపు తిప్పేందుకు ఇంకా అష్టకష్టాలు పడుతూనే ఉన్నారు. ఇప్పుడు కౌశిక్ రెడ్డి వివాదం కూడా తలపైకి ఎక్కింది. ఓవైపు ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంపై యుద్ధం చేస్తామంటున్న విపక్షానికి ఇది ఎక్కడా కలిసి రావడం లేదు. ఈ నేతల తీరు చూస్తుంటే అటు గులాబీ బాస్ కూడా అయోమయానికి లోనవుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## నేటి నుంచే దేశవ్యాప్త

# జనగణన




(మొదటి పేజీ తరువాయి)

గోప్యంగా ఉంటుందని, దీనిని ఆర్టీఐ పరిధిలోకి రానీయకుండా, న్యాయస్థానాల్లో సాక్ష్యంగా వాడకుండా చట్టపరమైన రక్షణ కల్పించారు.

**33 ప్రశ్నలతో గృహగణన.. ఏపీ, తెలంగాణ షెడ్యూల్ ఇదే**

తొలిదశలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు గృహగణన కార్యక్రమం జరుగుతుంది. ఇందులో మొత్తం 33 ప్రశ్నల ద్వారా ప్రజల నివాస స్థితిగతులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వారి చరాస్తుల వివరాలను సేకరిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో సెల్ఫ్ ఎన్యూమరేషన్ ద్వారా ఏపీలో ఏప్రిల్ 16 నుంచి 30వ తేదీ వరకు వివరాలు మనమే సొంతంగా నమోదు చేసుకోవాలి. మే 1 నుంచి 30 వరకు సెన్సస్ ఎన్యూమరేటర్ ద్వారా ప్రక్రియ జరుగుతుంది. తెలంగాణలో ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు ప్రజలే సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేయవచ్చు. ఆపై మే 11 నుంచి జూన్ 9 వరకు అధికారులు ప్రక్రియ చేపడతారు. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చి వివరాలు సేకరించడమే కాకుండా, ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునేలా ప్రత్యేక పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

**సెల్ఫ్ ఎన్యూమరేషన్.. మీ వివరాలు మీరే నమోదు చేసుకోవచ్చు**

పౌరులు తమ వివరాలను https://se.census.gov.in వెబ్‌సైట్‌లో లేదా మొబైల్ యాప్‌లో స్వయంగా నమోదు చేసుకోవచ్చు. ఇంటి యజమాని పేరు, మొబైల్ నంబర్ ద్వారా ఓటీపీ పొంది లాగిన్ అవ్వాలి. వివరాలన్నీ నమోదు చేసిన తర్వాత 'H' అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల ఐడీ జనరేట్ అవుతుంది. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ఈ ఐడీని వారికి చూపిస్తే సరిపోతుంది. ఒకవేళ ఏవైనా మార్పులు ఉంటే ఆ సమయంలోనే సరిచేసుకోవచ్చు. అయితే, ఈ సెల్ఫ్ ఎన్యూమరేషన్ సౌకర్యం ఎన్ఆర్ఐ (NRI)లకు వర్తించదు.

**కీలక నిర్ణయాలు, మినహాయింపులు**

తొలిదశలో కులగణన ఉండదని, కేవలం రెండో దశలో మాత్రమే కులం, మతం వివరాలు సేకరిస్తారని స్పష్టం చేశారు. అలాగే, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ అప్‌డేషన్‌ను ప్రస్తుతానికి చేపట్టడం లేదు. జనగణన వివరాల ఆధారంగా ప్రభుత్వ పథకాల్లో ఎటువంటి కోతలు ఉండవని అధికారులు హామీ ఇచ్చారు. సామాజిక మార్పులకు అనుగుణంగా, స్థిరమైన బంధంలో ఉన్న సహజీవన జంటలను కూడా వివాహిత జంటగా పరిగణించి వివరాలు నమోదు చేయనున్నారు. ఇంటర్నెట్, వాహనాలు, గృహోపకరణాల వాడకం వంటి అంశాలను కూడా ఈ ప్రశ్నావళిలో చేర్చారు.

**సహజీవన జంటలకు కుటుంబ గుర్తింపు**

జనగణన ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా, చాలా కాలం నుంచి సహజీవనం చేస్తున్న జంటలను ఇకపై ఒకే యూనిట్‌గా గుర్తించి, వారికి 'కుటుంబ హోదా' కల్పించాలని నిర్ణయించింది. స్థిరమైన బంధంలో ఉంటూ కలిసి జీవిస్తున్న వారిని ఒకే ఫ్యామిలీగా పరిగణించి జనగణన రికార్డుల్లో నమోదు చేయనున్నారు. ఆధునిక సంబంధాలకు అధికారిక గుర్తింపునిచ్చే దిశగా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

**సుదీర్ఘ కాలం తర్వాత..!**

2011 తర్వాత సుదీర్ఘ విరామం అనంతరం జరుగుతున్న ఈ ప్రక్రియలో డేటా సేకరణ కోసం అత్యాధునిక మొబైల్ యాప్‌లను వినియోగిస్తున్నారు. 2021లో జరగాల్సిన జనగణన కరోనా కారణంగా నిర్వహించలేదు. పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌకర్యాన్ని కూడా ఈసారి అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు తెలిపారు.

# లొంగిపోని గణపతి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

మావోయిస్టులు లేని దేశంగా ప్రకటించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ లో పెద్ద ఎత్తున మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలిసే విధంగా చేసి విజయం సాధించారనే చెప్పవచ్చు. అయితే ఆపరేషన్ కగార్ చివరి దశకు చేరుకుంది. ఇంకా మిగిలి ఉన్న కొంతమంది కోసం మార్చి 31 లోపల లొంగిపోవాలని డెడ్లైన్ విధించగ, ఈ డెడ్ లైన్ మంగళవారంతో ముగిసింది.

**ఇంకా అజ్ఞాతంలోనే గణపతి...**

మావోయిస్టు రహిత దేశంగా ప్రకటించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ చివరి దశకు చేరింది. ఇందులో భాగంగా కొంత మందిని ఎన్కౌంటర్ చేసి ఏరి వేయగా, మరి కొంత మందిని లొంగిపోయే విధంగా చేసి వారికి అన్ని రకాల అండగా నిలిచారు. గడిచిన రెండేళ్లలో 721 మంది మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలిసినట్లు పోలీసులు ప్రకటించారు. అయితే జగిత్యాల జిల్లా బీర్పూర్‌కు చెందిన మావోయిస్టు పార్టీ మాజీ చీఫ్ ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతిని ఇప్పటికే లొంగిపోవాలని చాలాసార్లు పోలీసులు, కేంద్రం ప్రకటించిన ఇంత వరకు లొంగిపోలేదు. మార్చి 31 లోపు లొంగిపోవాలని గడువు విధించిన పట్టించుకోని గణపతి ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు. పోలీసులు విధించిన గడువు మార్చి 31 తో ముగియగా, తదుపరి కార్యాచరణ ఎలా ఉంటుందో వేచి చూడాలి మరి.

**ఇంకా మిగిలినది 8మందే...**

భూస్వామ్య, పెట్టుబడిదారుల ఆగడాలకు వ్యతిరేకంగా మొదలైన మావోయిస్టు ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి 5 దశాబ్దాలు ఏళగా, ప్రస్తుతం చివరి దశలో ఉంది. ఐతే ఎంతోమంది చనిపోగా, కొంత మంది లొంగిపోయారు. ఇందులో భాగంగా ఇంకా 8 మంది మిగిలి ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టు మాజీ చీఫ్ గణపతి వెంటనే లొంగిపోతే అన్ని రకాల అండగా ఉంటామని, అలాగే వైద్య సేవలు కూడా అందిస్తామని, వెంటనే లొంగిపోవాలని డీజీపీ బి. శివధర్ రెడ్డి చివరిసారిగా కోరిన ఎలాంటి స్పందన కనిపించడం లేదు. అయితే గణపతితో పాటు కాజీపేటకు చెందిన పసునూరి నరహరి అలియాస్ సంతోష్, వార్త శేఖర్ అలియాస్ మగ్తు, జోడి రత్నాబాయి అలియాస్ సుజాత, నక్క సుశీల అలియాస్ రేలా, గంగ బోయిన భాగ్య అలియాస్ రూపీలను కూడా వెంటనే లొంగిపోవాలని పోలీసులు కోరుతున్నారు.

## గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 2 నుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, వార్డు సభలను పకడ్బందీగా,పెద్ద ఎత్తున నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు మరియు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలు /వార్డు సభల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు.ఏప్రిల్ 2న రాష్ట్ర వ్యాప్తంగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు గ్రామసభలు / వార్డు సభలు నిర్వహించాలని, గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే జూన్ 2 నుండి ప్రారంభం కానున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం అమ లు చేయబోతున్న విషయాన్ని వివరించాలని, ప్రభుత్వ పాఠశాల ల విద్యార్థులకు అల్పాహార పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విశయం కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. సాంస్కృతిక కళాకారుల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో గ్రామసభలు / వార్డు సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఈకార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిం చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పాండు, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి,తదితర అధికారులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి గ్రామసభలు

### పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆదేశించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఈ నెల 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. సభలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదట సీఎం సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అలాగే జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ, ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.




# పల్లెలకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

విధించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లోని గ్రామాల్లో అభివృద్ధి పనుల ఆర్థిక వెసులుబాటు కలిగింది. ఇందులో భాగంగా తెలంగాణ పంచాయతీరాజ్ సంస్థలకు రూ. 247.94 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్స్ కేటాయించింది. ఈ నిధులతో రాష్ట్రంలోని 12600 గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన జరగనుంది. ఇవి అన్‌టైడ్ గ్రాంట్స్ కావడంతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయించిన ప్రాధాన్యత పనులకు ఈ నిధులను ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, మురుగు నీటి కాల్వల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, శ్మశాన వాటికల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఊతమివ్వనున్నాయి. అయితే ఈ నిధులను కేవలం అభివృద్ధి పనులకే వాడాలని, సిబ్బంది జీతాలు లేదా కార్యాలయ నిర్వహణ ఖర్చులకు వినియోగించరాదని కేంద్రం స్పష్టమైన నిబంధనలు విధించింది. కాగా అత్యధికంగా మహారాష్ట్రకు రూ. 800 కోట్లు కేటాయించగా. రాజస్థాన్‌కు రూ. 315. 61 కోట్లు విడుదలయ్యాయి. ఉత్తరాఖండ్‌కు రూ. 91.31 కోట్లు, మేఘాలయకు రూ. 49.20 కోట్లు అందాయి.

**నిధులు పక్కదారి పట్టకుండా**

గతంలో నిధుల వినియోగంలో జరిగిన జాప్యం, మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో కేంద్రం ఇప్పుడు కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ప్రతి పైసా ఆడిట్ కావాలని, గ్రామ పంచాయతీలు తమ అభివృద్ధి ప్రణాళికలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ నిధులను సకాలంలో పంచాయతీలకు చేరవేసి, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. పల్లె ప్రగతిలో ఈ నిధులు కీలక పాత్ర పోషించనున్నాయి. కాగా, గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగ్గా.. పల్లెల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. దాదాపు రెండేళ్లు ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు ఉండగా.. పాలకవర్గం కొలువుదీరటంతో అభివృద్ధి పనులు వేగంగానే కొనసాగుతున్నాయి.

# నిర్మాణం.. భారం

**దేశవ్యాప్తంగా పెరిగిన సిమెంట్ ధరలు**

**బస్తాకు రూ.30 నుంచి 50 వరకు పెంపు**

**బుకింగ్స్ నిలిపివేసిన సిమెంట్ కంపెనీలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

భవన, ఇతర నిర్మాణాలు భారం కానున్నాయి. నేటి నుంచి దేశవ్యాప్తంగా సిమెంట్ ధరలు భారీగా పెరిగాయి బస్తాపై గణనీయమైన ధరలను పెంచుతున్నట్లు ఇప్పటికే సిమెంట్ కంపెనీలు సంబంధిత డీలర్లకు సమాచారం అందించాయి. ఈ పెరిగిన ధరలు నేటి నుంచి అమలులోకి రానున్నాయి. సిమెంట్ బస్తా (50 కేజీలు) ధరపై రూ. 30 నుంచి రూ. 50 వరకు పెరిగింది. దీంతో ప్రముఖ కంపెనీల సిమెంట్ బస్తా ధర మార్కెట్లో సుమారు రూ. 360కి చేరింది. రవాణా ఖర్చులు పెరగడం, ముడి సరుకుల ధరల పెంపు వంటి కారణాలతో కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించాయి. మరోవైపు ధరల పెంపు నేపథ్యంలో సిమెంట్ కంపెనీలు మంగళవారం నుంచే కొత్త బుకింగ్‌లను పూర్తిగా నిలిపివేశాయి. పాత ధరలపై మార్చి 30 వరకు మాత్రమే ఆర్డర్లు తీసుకున్నాయి. మంగళవారం సిమెంట్ కొనుగోలు, బుకింగ్ చేయాలని కోరిన డీలర్లకు కంపెనీలు నిరాకరించాయి. నేటి నుంచి పెరిగిన కొత్త ధరలతోనే బుకింగ్స్ ప్రారంభిస్తామని ప్రకటించాయి. కేవలం సిమెంట్ ధరలే కాకుండా, ఇటీవల ఇటుకలు, ఇసుక , కూలీల రేట్లు కూడా పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పుడు సిమెంట్ ధర కూడా బస్తాకు రూ. 50 వరకు పెరగడంతో ఒక సాధారణ ఇంటి నిర్మాణ వ్యయం రూ.వేలల్లో పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన వారు , కొత్తగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారు ఈ అదనపు భారాన్ని మోయాల్సి వస్తుంది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
01.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ప్రతి ఖాతాకు వేర్వేరు పాస్‌వర్డ్‌లు పెట్టండి**

ఒకే పాస్‌వర్డ్ అన్ని సైట్లలో వాడితే ప్రమాదం పెరుగుతుంది.





## నీటి దోపిడీని ఆపండి..

- శ్రీశైలంలో తెలంగాణకు 64 శాతం నీటి వాటా
- రైతుల హక్కుల కోసం మరో పోరాటం
- అక్రమ నీటి తరలింపుతో ఏపీలో విద్యుత్ ఉత్పత్తి
- మంత్రి జూపల్లి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా ఆంధ్రప్రదేశ్ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో మా పంటలు ఎండుతుంటే మీరు ఎలా విద్యుత్ ఉత్పత్తి చేస్తారని మండిపడ్డారు. తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తారా అని నిలదీశారు. శ్రీశైలంలో నీటి దోపిడీని గత ప్రభుత్వం పట్టించుకోలేదన్న మంత్రి... ఆ తప్పిదాలను ఏపీ ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని ధ్వజమెత్తారు. తెలంగాణ రైతుల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుతామని హెచ్చరించారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీశైలంలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందన్నారు. ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల రైతుల హక్కులు కాలరాస్తే ఊరుకోబోమన్నారు. నీటి నిల్వలు తక్కువగా ఉంటే విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలనే నిబంధనలు ఉన్నా ఏపీ మాత్రం అందుకు భిన్నంగా అక్రమంగా నీటిని వాడుతోందని దుయ్యబట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయిందని, మేం ధర్నా చేస్తాం అనే వరకు నీళ్లు దోచుకుందన్నారు. నాడు తాము హైకోర్టుకు వెళ్లడంతో న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు ఇంకా జరగలేదన్నారు. ఈ విషయంలో సమాచారం ఇవ్వక పోవడానికి ఏమైనా చదువురాని వారా? అని ప్రశ్నించారు. జీవోలు ఉన్నా ఇంకా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏముందన్నారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసిందన్న జూపల్లి... చట్టప్రకారం నడుచుకోవాలని ఏపీ ప్రభుత్వానికి సూచించారు.



## పాడి చుట్టు ఉచ్చు

- వివాదాస్పద వ్యాఖ్యలతో చిక్కుల్లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి
- ఈ నెల 4న విచారణకు రావాలని సీఐడీ నోటీసులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

వివాదస్పద ఎమ్మెల్యేగా గుర్తింపు పొందిన హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చుట్టు ఉచ్చు బిగిస్తోంది. అనుచిత వ్యాఖ్యలతో చిక్కుల్లో పడ్డ ఆయనపై దర్యాప్తు సంస్థలతో పాటు ప్రభుత్వమూ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బెదిరించారన్న ఆరోపణలు మూటగట్టుకున్న ఆయనపై ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. తాజాగా.. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో ఆయనకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల ఏప్రిల్ 4న హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని మంగళవారం జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది. కాగా గత కొంతకాలంగా అధికార పక్షంపై నిప్పులు చెరుగుతున్న కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు రావడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. ఇది కక్షపూరిత చర్య అని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని అంటోంది.


**అసలు కేసు ఇది**

ఈ ఏడాది జనవరి 29న వీణవంక మండలంలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా బందోబస్తులో ఉన్న పోలీసులకు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు తనను, తన కుటుంబాన్ని జాతర వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి ఆయన మతంపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ క్రమంలోనే సీఐడీ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేసారు. ఏప్రిల్ 4న జరిగే విచారణలో కౌశిక్ రెడ్డి వివరణ తీసుకోనున్నారు.

### ప్రజల కోసం పోరాడుతూనే ఉంటా : కౌశిక్ రెడ్డి

సీఐడీ నోటీసులపై ట్విట్టర్ వేదికగా స్పందించిన పాడి కౌశిక్ రెడ్డి ప్రశ్నించే గొంతును అణచలేరని.. ప్రజల కోసం తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఏ తప్పు చేయకపోయినా నోటీసులు పంపారని.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. తాను వెనక్కి తగ్గేది లేదని ట్వీట్ చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో నా కుటుంబ సభ్యులను, మా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఇలా బెదిరింపులకు గురిచేయడం తగదని కౌశిక్ రెడ్డి ట్వీట్ చేశారు.

# వెంటాడుతున్న అకాల వర్షం



- రెండు నెలల్లో రెండోసారి
- వడగళ్ల వానకు వేల ఎకరాల్లో పంటనష్టం
- ప్రారంభించని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు
- అమలుకాని పంట బీమా
- పరిహారం పైనే రైతన్నల ఆశలు
- నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

అకాల వర్షాలు రైతన్నలను అతలాకుతలం చేస్తున్నాయి.. రెండు నెలల్లో రెండు సార్లు కురిసిన వడ గళ్ల వానకు రైతుల ఆశలు అడియాశలయ్యాయి. సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారు జామున ఒకేసారి బలంగా వీచిన ఈదురు గాలులు, వడ గళ్లు, వర్షాలతో రైతాంగం కుదేలైంది. ఇప్పటికే మొక్కజొన్న పంట కోసి ఆరబెడుతున్న సమయంలో ఈ వర్షాలు రావడంతో పంట నీటిలో కొట్టుకుపోయింది. ఈనే దశలో ఉన్న వరి పంట కూడా అకాల వర్షం కారణంగా పూర్తిగా నేలమట్టమైంది. దీంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడి సైతం కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది.

**మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యంతో నష్టం**

ఇదిలా ఉంటే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వ జాప్యం కూడా రైతులకు శాపంగా మారింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 మేరకు ఉంటే ప్రైవేటు వ్యాపారులు రూ.18 వందల నుంచి రూ.19 వందల వరకు చెల్లిస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాక అమ్మేందుకు మొక్కజొన్నలు ఎండబెట్టడం, అర్ధరాత్రి అకాల వర్షంలో కొట్టుకుపోవడం రైతులను ఆవేదనకు గురి చేస్తోంది.

### ప్రభుత్వం ఆదుకోవాలి: రైతు ముత్యం రెడ్డి



వరుసగా రెండు నెలల్లో రెండు మార్లు పంట నష్టం చూడాల్సి వచ్చిందని లక్ష్మణ చాందకు చెందిన రైతు సురకంటి ముత్యం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల కురిసిన అకాల వర్షాల నష్టం సర్వే పూర్తయినా రైతులకు పరిహారం విషయంలో ఇంతవరకు ఎలాంటి ప్రకటన రాలేదన్నారు. ఇపుడు సర్వే పూర్తై ప్రకటన ఎపుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సర్వే చేసి, పరిహారంపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు. అలాగే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు.



### పంటనష్టం అంచనా...

**కోరుట్ల, ముద్ర;**

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా రైతాంగానికి భారీ నష్టం వాటిల్లింది. వ్యవసాయ అధికారి నాగమణి మంగళవారం రైతులతో కలిసి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 260 ఎకరాలలో వరి, 45 ఎకరాలలో మొక్కజొన్న, 510 ఎకరాలలో మామిడి నష్టపోయినట్టుగా ప్రాథమిక నివేదిక జిల్లా స్థాయి అధికారులకు పంపించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నరేష్ , రాఘవేంద్ర, ఫెమీన, శ్రీహరి, ఏకీన్పూర్, సంగెం గ్రామ రైతులు ఉన్నారు.

### 126 గ్రామాలు.. 9323 ఎకరాల్లో పంట నష్టం

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

ఒక వైపు పంటల సాగు ఖర్చులు తడిసి మోపెడు అవుతుంటే, మరో వైపు ప్రకృతి కూడా తమపై పగ పట్టి అకాల వర్షాలతో నట్టేట ముంచుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమాను అమలు చేయక పోవడం వల్ల పంట నష్టపరిహారం వస్తాయని ఆశలు కూడా లేవని, కేవలం ప్రభుత్వం దయ తలచి అంత నష్ట పరిహారం అందజేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. జగిత్యాల జిల్లాలోని 20 మండలాల్లో మంగళవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాల వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలోని 126 గ్రామాల్లో 5986 రైతులకు చెందిన 9323 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. 1521 ఎకరాల్లో మొక్కజొన్న, 1128 ఎకరాల్లో వరి, 7000 ఎకరాల్లో మామిడి, 582 ఎకరాల్లో నువ్వుల పంటలకు నష్టం వాటిల్లిందని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు.

**అమలుకు నోచుకొని పంటల భీమా..**

ప్రకృతి విపత్తుల నుంచి పంట నష్టం జరిగినప్పుడు ఆదుకునేందుకు ప్రవేశపెట్టిన పంటల బీమా పథకం తెలంగాణ రాష్ట్రంలో అమలు కావడం



లేదు. ఫలితంగా ఎన్నిసార్లు అకాల వర్షాలకు వంట నష్టం జరిగిన ఒక రూపాయి కూడా నష్టపరిహారం అందక అన్నదాతలు నష్టపోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా పంట నష్ట పరిహారం అందజేసి తమను ఆదుకోవాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ఐక్యతతో ముందుకు సాగాలి

- మార్గదర్శకులు మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే
- ఈ నెల 11న ట్యాంక్ బండ్ పై విగ్రహాల ఆవిష్కరణ
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాష్ట్రంలోని బీసీ వర్గాలు తమ అభ్యున్నతి కోసం ఐక్యతతో ముందుకు సాగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. బీసీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం చేపడుతోన్న కార్యక్రమాలకు అండగా నిలవాలన్నారు. ఈ నెల 11న ట్యాంక్ బండ్ ఐమాక్స్ థియేటర్ ఎదురుగా లేక్ వ్యూ పార్క్ వద్ద మహాత్మా జ్యోతిబాపూలే,సావిత్రి బాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అక్కడ కొనసాగుతోన్న నిర్మాణ పురోగతి పనులను మంత్రి కొండా సురేఖ, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, బీసీ సంఘాల సభ్యులతో కలిసి మంత్రి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలేలు మార్గదర్శకులుగా నిలుస్తారని మంత్రి అన్నారు. ఖైరతాబాద్ సర్కిల్లో దాదాపు రూ. రూ.4 కోట్లతో మహాత్మాజ్యోతిబాలే, సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. విగ్రహాలు చూడగానే వారి జీవిత చరిత్ర ప్రజల్లో వారు అందించిన సేవలు, సంస్కరణలు ఆలోచింపజేసేల విగ్రహాలు పెట్టుకుంటామన్నారు. ఈ మార్గానికి పూలే మార్గ్‌గా పెట్టాలని స్థానిక శాసన సభ్యులు దానం నాగేందర్ సూచించారన్నారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ జిల్లా వాళ్ళు సమన్వయం తో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి కొండా సురేఖా మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే సామాజిక సంస్కర్త, విద్యా ప్రాధాన్యతను ముందుకు తెచ్చి నడిపించారని అన్నారు. అలాగే కుల వివక్షను ఎదుర్కొని సమానత్వం కోసం ఎంతో పోరాడారని అన్నారు. మహిళల విద్య ప్రోత్సాహన, బాల్య వివాహాల నిరోధంలో జ్యోతిబా పూలే, సావిత్రిబాయ్ పూలే కీలక పాత్ర పోషించారని తెలిపారు. 'గులాం గిరి' వంటి రచనల ద్వారా సామాజిక దోపిడీపై పోరాటంతో పాటు బలహీన వర్గాల చైతన్యం పరచటంలో తమ విశ్వసనీయత చాటుకున్నారని చెప్పారు. అలాంటి మహానుభావుల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు.



## ఇప్ప చెట్లు నాటాలి..

- సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి లేఖ
- లేఖపై 52 మంది ఎమ్మెల్యేల సంతకాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజికఆర్థిక ప్రయోజనాల కోసం ఇప్ప చెట్లను పెద్ద ఎత్తున నాటాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రంలో అనుకూల కలిగిన ప్రాంతాలలో 10 లక్షల ఇప్ప చెట్లను నాటేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్ప చెట్లు కరువును తట్టుకోగలవని తెలంగాణ వంటి అర్ధశుష్క ప్రాంతాలకు ఇవి ఎంతో అనుకూలమైనవి పేర్కొన్నారు. ఇవి నేల సారవంతాన్ని పెంచడంతో పాటు భూక్షయాన్ని అరికట్టి పచ్చదనాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. ఇప్ప పువ్వులు, గింజలు ఆదాయానికి మంచి వనరులని, గిరిజనులు, గ్రామీణ ప్రజలు వీటిని ఆహారం, ఔషధాలు, జీవనోపాధి కోసం సాంప్రదాయకంగా వినియోగిస్తారుని తెలిపారు. పోషకాలు సమృద్ధిగా ఉండి ఔషధ గుణాలు స్థానిక ఆరోగ్య సంరక్షణకు ఎంతో మేలు చేసే ఈ ఇప్ప పువ్వు చెట్లను విరివిగా పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు అనిరుధ్ రెడ్డి ప్రారంభించిన ఇప్పపువ్వు చెట్ల ఉద్యమానికి భారీగా స్పందన లభిస్తోంది. రాష్ట్రంలో 10 లక్షల ఇప్ప చెట్లు నాటేలా చర్యలు తీసుకోవాలంటూ రేవంత్ రెడ్డికి ఆయన రాసిన లేఖకు ఇప్పటి వరకు 52 మంది ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు.

# టాలీవుడ్‌కు డ్రగ్ షాక్

- సినీ యాక్టర్లందరూ డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సినీ నటీనటులందరూ డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సంచలన డిమాండ్ చేశారు. డ్రగ్స్ టెస్ట్ చేయించుకుంటేనే వారి సినిమాల విడుదలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. డ్రగ్స్ టెస్ట్ చేయించుకోని యాక్టర్లు.. డ్రగ్స్ తీసుకున్నట్లే అని హాట్ కామెంట్స్ చేశారు. తాను ఎవర్నీ తప్పుబట్టడం లేదని.. అందరూ బాధ్యతగా ఉండాలని అనుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కూడా మద్యం తాగొద్దని భర్తలతో భార్యలు ఒట్టువేయించుకోవాలని కోరారు. . మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో ఇప్పపువ్వు సారాపై తాను మాట్లాడితే ట్రోలింగ్ చేశారని మండిపడ్డారుఇప్ప పువ్వు సారాపై తాను చేసిన వ్యాఖ్యలపై జరుగుతోన్న ట్రోలర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుడిగా తాను సారా గురించి మాట్లాడితే ట్రోల్స్ చేస్తున్నారన్న ఆయన ఇదే సారాను ఖుషీ సినిమాలో పవన్ కల్యాణ్ తాగుతున్నట్లు నటిస్తే జనాలు ఈలలు కేకలు వేశారన్నారు. బాలకృష్ణ ఏకంగా 'మామ ఏక్ పెగ్ లా' అనే పాటకు డ్యాన్స్ చేసినా ఎంజాయ్ చేశారన్నారు. అదే మేము ప్రజల ఆరోగ్యం గురించి ఇప్పపువ్వ ప్రస్తావన తీసుకొస్తే ట్రోల్స్ చేస్తున్నారనీ ఇది సరైన పద్ధతి కాదని అనిరుధ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
01.04.2026 బుధవారం, హైదరాబాద్
4 వేదిక
Peoples Voice
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ 'ముద్ర' వేయండి
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




# ఆల్ ఫూల్స్ డే 01 ఏప్రిల్ !

(01 ఏప్రిల్ "ఏప్రిల్ ఫూల్స్ డే" సందర్భంగా)



"తాజా సమాచారం ప్రకారం, అమెరికా అధ్యక్షుడు తాను ఇటీవల తీసుకున్న నిర్ణయాలన్నింటినీ వెనక్కి తీసుకున్నారనే వార్త ప్రపంచ మానవాళిని ఆనంద డోళికల్లో ముంచేస్తున్నది. అదే విధంగా ప్రపంచ ప్రజలు స్మార్ట్‌ఫోన్‌పై విరక్తి చెంది నేటి నుంచి వాడడం మానేశారనే వార్త కూడా సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నది". ఈ వార్తలను మీరు నమ్మడం లేదు కదా ! మీరు నమ్మినట్లైతే మీరు పప్పులో కాలేయినట్లే, ఏప్రిల్ ఫూల్ అయినట్లే.

**చిలిపి సరదాల నెలవు ఆల్ ఫూల్స్ డే :**

అనాదిగా ప్రపంచ దేశాలు 01 ఏప్రిల్ రోజున "ఏప్రిల్ ఫూల్స్ డే" లేదా "ఆల్ ఫూల్స్ డే" నిర్వహించుకోవడం చూస్తేనే ఉన్నాం. ఆత్మీయులను సరదాగా ఆట పట్టించడం, క్షణ కాలం పాటు అబద్ధాలతో సహచరులు లేదా బంధువులను ఆశ్చర్యచకితులను లేదా ఫూల్ చేయడం, లేని దానిని ఉన్నట్లు లేదా ఉన్న దానిని లేనట్లుగా భ్రమింపజేయడం, జోక్స్ వేసుకొని నవ్వుకోవడం, చిలిపిగా ఒకరినొకరు మోసం చేసుకోవడం, అబద్ధపై వార్తలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం లాంటి పలు ప్రవర్తనలతో ఏప్రిల్ ఫూల్ అంటూ సంతోషంగా గడపడం "ఆల్ ఫూల్స్ డే"కు మాత్రమే సొంతం.


**ఏప్రిల్ ఫూల్ దినం చారిత్రక నేపథ్యం:**

చారిత్రక నేపథ్యాలను తవ్వి చూస్తే ఏప్రిల్ ఫూల్స్ డే జననం 1582కు చెందుతుంది. ఫ్రాన్స్‌లో 01 ఏప్రిల్ రోజున ప్రారంభం అయ్యే జూలియన్ క్యాలెండర్ నుంచి 01 జనవరిన ప్రారంభమయ్యే గ్రిగోరియన్ క్యాలండర్‌కు మారిన సందర్భంలో ప్రజల కొంత అసౌకర్యానికి లోనుకావడం, ఈ మార్పును అర్థం చేసుకోలేదని వారిని ఏప్రిల్ ఫూల్‌గా గేలి చేయడం ఆచారంగా మారి, కాల క్రమంలో అన్ని దేశాలకు విస్తరించడంతో ఏప్రిల్ ఫూల్ డే బహుళ ప్రచారంలోకి వచ్చింది. మరో వివరణ ప్రకారం హిలారీ అనే పురాతన రోమ్ పండుగలో రుతువులు మారుతూ వాతావరణ మార్పులు అసంబద్ధంగా ఉండడంతో ఏప్రిల్ ఫూల్ అంటూ ఒకరినొకరు ఆట పట్టించుకోవడం జరిగేదని కూడా తెలుపబడింది. బైబిల్ ఆచారం ప్రకారం 'నోహ' అనే పాత్ర తొలి ఏప్రిల్ ఫూల్ అయ్యాడని తెలుపుతున్నది. వ్యాపార సామ్రాజ్యాలు, క్రీడలు, రెస్టారెంట్లు లాంటి అనేక స్థలాల్లో కూడా 01 ఏప్రిల్ రోజున ఆల్ ఫూల్స్ డేను సరదాగా ప్రదర్శించడం జరుగుతూ వస్తున్నది.

హానికరం కాని, మరొకరి మనసు నొప్పించని జోక్స్, అవమానకరం కాని అవాస్తవ సమాచారాలు, ఆట పట్టించే సందర్భాలతో కొనసాగుతున్న ఆల్ ఫూల్స్ డే ప్రపంచ మానవాళిని సంతోష సాగరంలో ముంచేయడంతో పాటు మానసిక సాంత్వన చేకూర్చడం జరుగుతున్నది. నేటి ఏప్రిల్ ఫూల్ డే సరదాగా గడపాలని, మన వల్ల మరొకరి మనసు నొచ్చుకోకూడదని అర్థం చేసుకుంటూ ఆనందంగా ఆల్ ఫూల్స్ డేను జరుపుకుందాం. దైనందిన వేగవంతమైన జీవన విధానం లోంచి కొంత సమయాన్ని కేటాయించి ఏప్రిల్ ఫూల్ అంటూ మానసిక ఒత్తిడిని తగ్గించుకుంటూ ఈ రోజైనా ఉల్లాసంగా గడుపుదాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# మహావీరుని బోధనలు ఆచరణీయం



మహావీర్ జయంతి జైన మతానికి చెందిన ప్రముఖ పండుగ. జైన మతంలోని చివరి తీర్థంకరుడు వర్ధమాన మహావీర్ జన్మదినంగా ప్రతి సంవత్సరం దీనిని ఘనంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం ఇది మార్చి 31న వచ్చింది. మహావీర్ క్రీస్తుపూర్వం 599లో వైశాలి సమీపంలోని కుండగ్రామంలో జన్మించారు. తండ్రి సిద్ధార్థుడు, తల్లి త్రిశలాదేవి. చిన్ననాటి నుంచే ధైర్యం, దయ గుణాలు కలిగిన ఆయనకు "మహావీర్" అనే బిరుదు వచ్చింది.30 ఏళ్ల వయస్సులో భౌతిక జీవితాన్ని విడిచిపెట్టి సన్యాసం స్వీకరించిన ఆయన 12 సంవత్సరాల తపస్సుతో ఆత్మజ్ఞానం పొందారు. అనంతరం సత్యం, అహింస, క్షమ, అపరిగ్రహం వంటి విలువలను ప్రజలకు బోధించారు. ఆయన ప్రధాన సందేశం "అహింసా పరమో ధర్మః" — ఏ జీవికి హాని చేయకపోవడం అత్యున్నత ధర్మం. సత్యవచనం, దొంగతనం చేయకపోవడం, లోభం విడిచిపెట్టడం వంటి సూత్రాలు ఆయన బోధనలలో ముఖ్యమైనవి.మహావీర్ జయంతి రోజున జైనులు ఆలయాలలో ప్రార్థనలు చేసి, విగ్రహాలను అలంకరించి ఊరేగింపులు నిర్వహిస్తారు. దానధర్మాలు, ఉపవాసం వంటి పుణ్యకార్యాలు చేస్తారు. ఈ పండుగ శాంతి, సహనం, సహజీవన విలువలను గుర్తుచేస్తుంది.

నేటి కాలంలో హింస, అసహనం పెరుగుతున్న నేపథ్యంలో మహావీర్ బోధనలు మరింత ప్రాధాన్యత పొందుతున్నాయి. సామాజిక విభేదాలు, సోషల్ మీడియా ద్వేష ప్రసారాలు, అసమానతలు సమాజంలో అశాంతిని పెంచుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అహింసా సిద్ధాంతం మార్గదర్శకంగా నిలుస్తుంది.అపరిగ్రహం అనే భావన అధిక ఆశలు, సంపద కోసం పరుగు తీస్తున్న ప్రపంచానికి నియంత్రణను నేర్పుతుంది. సత్యవ్రతం సమాజంలో న్యాయం, నమ్మకాన్ని పెంచి మంచి పాలనకు పునాది అవుతుంది. మహావీర్ బోధనలు ఆధ్యాత్మికంగానే కాక సామాజిక, ఆర్థిక రంగాల్లో కూడా మార్గనిర్దేశం చేస్తాయి.ఈ రోజు జరిగే పూజలు, ఊరేగింపులు సంప్రదాయాలకే పరిమితం కాకుండా మానవత్వాన్ని పెంపొందించే సాధనాలుగా మారాలి. పేదలకు సహాయం, జంతువులపై కరుణ, ప్రకృతి సంరక్షణ వంటి చర్యలు మహావీర్ బోధనల ఆచరణలో భాగం.పర్యావరణ సంక్షోభం పెరుగుతున్న ఈ కాలంలో ప్రతి జీవిని గౌరవించడం అనే ఆయన సందేశం మరింత అవసరం. ప్రకృతి, జీవజాలాన్ని కాపాడటం మన బాధ్యత. మహావీర్ జయంతి కేవలం పండుగ కాదు, సమాజం తన దిశను సరిచేసుకునే ఆత్మపరిశీలన దినం.



ఆళవందార్ వేణు మాధవ్
8686051752,
హైదరాబాద్

# హద్దులు దాటని హాస్యం.. సమాజానికి ఆరోగ్యం

**ఏప్రిల్ ఫూల్ ప్రత్యేక కథనం**

మానవ పరిణామ క్రమంలో హాస్యం, వినోదం అనేవి కేవలం ఉల్లాసానికే కాక, సామాజిక సంబంధాలను దృఢపరిచే సాధనాలుగా కూడా పనిచేశాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఏప్రిల్ 1వ తేదీన జరుపుకునే 'ఏప్రిల్ ఫూల్ డే' ఒక ప్రత్యేక సంస్కృతిగా రూపుదిద్దుకుంది. ఇది కేవలం ఒక రోజులో ముగిసిపోయే వేడుక కాదు; దీని వెనుక శతాబ్దాల చరిత్ర, భౌగోళిక మార్పులు, సామాజికమానసిక విశ్లేషణలు అంతర్లీనంగా ఉన్నాయి. పత్రికా దృక్పథంతో విశ్లేషిస్తే, ఏప్రిల్ ఫూల్ అనేది సమాజంలోని హాస్య చైతన్యాన్ని నిశితంగా పరిశీలించే ఒక సందర్భం. సమాచార వ్యవస్థలపై ప్రజలకున్న అపరిమితమైన విశ్వాసాన్ని, అదే సమయంలో వారి అప్రమత్తతను పరీక్షించే ఒక విలక్షణమైన 'సంస్కృతి పండుగ'గా దీనిని అభివర్ణించవచ్చు. ఈ దినోత్సవం పుట్టుక గురించి కచ్చితమైన చారిత్రక ఆధారాలు లేనప్పటికీ, అత్యధికంగా ప్రాచుర్యంలో ఉన్న వాదన 16వ శతాబ్దపు క్యాలెండర్ మార్పులతో ముడిపడి ఉంది. 1582వ సంవత్సరంలో ఫ్రాన్స్ దేశం జూలియన్ క్యాలెండర్ నుంచి గ్రిగోరియన్ క్యాలెండర్‌కు మారింది. అంతకుముందు హిందూ నూతన సంవత్సరం తరహాలోనే వసంత కాలం ప్రారంభంలో, అంటే మార్చి చివరిలో ప్రారంభమై ఏప్రిల్ 1తో ముగిసేలా నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేవారు. అయితే గ్రిగోరియన్ క్యాలెండర్ ప్రకారం జనవరి 1ని నూతన సంవత్సరంగా ప్రకటించినప్పుడు, సమాచార లోపం వల్ల లేదా పాత పద్ధతులపై మక్కువతో కొందరు ఏప్రిల్ 1నే నూతన సంవత్సరాన్ని జరుపుకుంటూ ఉండేవారు. అటువంటి వారిని విజ్ఞానవంతులు 'ఏప్రిల్ మూర్ఖులు' (April Fools) అని పిలుస్తూ, వారి వీపుపై కాగితపు చేపలను అతికించడం లేదా లేని విందులకు ఆహ్వానించడం వంటి సరదా మోసాలకు పాల్పడేవారు. ఈ సంప్రదాయమే కాలక్రమేణా 'ఏప్రిల్ ఫూల్' అనే అంతర్జాతీయ పద ప్రయోగానికి నాంది పలికింది. ఈ ఆచారం కేవలం ఫ్రాన్స్‌కే పరిమితం కాకుండా 18వ శతాబ్దం నాటికి బ్రిటన్, స్కాట్లాండ్ వంటి దేశాలకు విస్తరించింది. స్కాట్లాండ్‌లో దీనిని రెండు రోజుల పాటు అత్యంత ఉత్సాహంగా జరుపుకునేవారు. అక్కడ దీనిని 'హంట్ ది గౌక్' అని పిలుస్తారు. 'గౌక్' అంటే స్కాటిష్ భాషలో కోకిల లేదా మూర్ఖుడు అని అర్థం. ఒక వ్యక్తిని పనికిరాని లేదా ఉనికిలో లేని పని మీద సుదూర ప్రాంతాలకు పంపించి, అతడు తిరిగి వచ్చాక ఎగతాళి చేయడం ద్వారా వారు వినోదం పొందేవారు. దీనికి కొనసాగింపుగా రెండో రోజున వ్యక్తుల వెనుక భాగంలో 'నన్ను తన్నండి' వంటి బోర్డులు తగిలించి హాస్యాన్ని పండించేవారు. ఇంగ్లాండ్‌లో మాత్రం దీనికి ఒక నైతిక పరిమితి ఉండేది; మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఇతరులను ఫూల్ చేయాలని, ఆ తర్వాత చేసే మోసాలు చేసేవారికే వర్తిస్తాయని వారు భావించేవారు. భారతదేశం విషయానికి వస్తే, ఈ సంస్కృతి బ్రిటిష్ పాలన కాలంలో దేశంలోకి ప్రవేశించింది. పాశ్చాత్య విద్య, జీవనశైలితో పాటు ఈ వినోద దినం కూడా భారతీయుల దైనందిన జీవితంలో భాగమైంది. ప్రారంభంలో కేవలం మెట్రో నగరాలు, విద్యావంతులకే పరిమితమైన ఈ వేడుకలు, నేడు సమాచార విప్లవం పుణ్యమా అని కుగ్రామాలకు కూడా పాకాయి. ముఖ్యంగా భారతీయ యువత, విద్యార్థులు తమ సృజనాత్మకతను ఉపయోగించి వినూత్నమైన 'ప్రాంక్స్' చేస్తూ ఈ రోజును ఉత్సాహంగా గడుపుతున్నారు. ఆధునిక యుగంలో ఏప్రిల్ ఫూల్ డే స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు వ్యక్తిగత స్థాయిలోనే ఉండే ఈ అల్లరి, నేడు మీడియా మరియు డిజిటల్ వేదికల ద్వారా సామాజిక స్థాయికి చేరుకుంది. వార్తా సంస్థలు కూడా ఈ రోజున పాఠకులను ఆకట్టుకోవడానికి 'కల్పిత వార్తలను' వాస్తవాల వలె ప్రచురించడం ఒక ఆనవాయితీగా మారింది. 1957లో బీబీసీ ప్రసారం చేసిన 'స్విస్ స్పఘెట్టి చెట్ల సాగు' వార్త ఇప్పటికీ చరిత్రలో నిలిచిపోయింది. చెట్లకు స్పఘెట్టి కాస్తుందని నమ్మి వందలాది మంది ప్రజలు ఆ చెట్లను ఎలా పెంచాలో అడిగిన సందర్భం మీడియా పవర్ ఏమిటో నిరూపించింది. అలాగే 1998లో 'బర్గర్ కింగ్' సంస్థ ఎడమ చేతి వాటం ఉన్నవారి కోసం ప్రత్యేక బర్గర్లను తయారు చేశామని ప్రకటించి సంచలనం సృష్టించింది. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో ఈ ధోరణి మరింత పెరిగింది. గణాంకాల ప్రకారం ఏప్రిల్ 1న సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అయ్యే సమాచారంలో దాదాపు 20 శాతం వరకు కేవలం వినోదం కోసమే సృష్టించిన ప్రాంక్ కంటెంట్ ఉంటుందని అంచనా. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలు ఈ రోజున ఫేక్ వార్తలతో నిండిపోతుంటాయి. ఇది ఒక రకంగా మానసిక ఉల్లాసాన్ని కలిగించినప్పటికీ, డిజిటల్ యుగంలో సమాచార విశ్వసనీయతపై తీవ్రమైన ప్రశ్నలను కూడా లేవనెత్తుతోంది. ఏది నిజం, ఏది అబద్ధం అని తేల్చుకోలేని స్థితిలో సామాన్యులు పడిపోవడం ఈ పండుగలోని ప్రతికూల అంశం. మానసిక శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం, ఏప్రిల్ ఫూల్ జరుపుకోవడం వెనుక మానవ సహజమైన సృజనాత్మకత మరియు సామాజిక అనుసంధానత దాగి ఉన్నాయి. ఇతరులను సున్నితంగా ఆటపట్టించడం ద్వారా మనుషుల మధ్య ఉన్న గ్యాప్ తగ్గుతుంది, సంబంధాలు మరింత సన్నిహితమవుతాయి. నవ్వు అనేది ఒక గొప్ప ఔషధంగా పనిచేసి, నిత్య జీవితంలోని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అయితే, ఈ హాస్యం అనేది ఒక కత్తి మీద సాము వంటిది. వినోదం మోతాదు మించితే అది విషాదానికి దారితీస్తుంది. ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, మరణాలు లేదా తీవ్రమైన ఆర్థిక నష్టాలకు సంబంధించిన అబద్ధాలు ఆడటం వల్ల వ్యక్తుల భావోద్వేగాలు దెబ్బతింటాయి. అందుకే నేడు అంతర్జాతీయ స్థాయిలో 'ఎథికల్ ఏప్రిల్ ఫూలింగ్' అనే భావన ప్రాచుర్యంలోకి వస్తోంది. అంటే, ఎవరి మనసును గాయపరచకుండా, ఎవరికీ హాని చేయకుండా కేవలం నవ్వును మాత్రమే పంపిణీ చేయడమే ఈ దినోత్సవం యొక్క అసలైన ఉద్దేశం కావాలి. అనేక బాధ్యతాయుతమైన సంస్థలు ఇప్పుడు తమ ప్రాంక్ వార్తల కింద ఇది ఏప్రిల్ ఫూల్ జోక్ అని చిన్న అక్షరాలతో సూచించడం ప్రారంభించాయి. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఈ దినోత్సవానికి వేర్వేరు పేర్లు, పద్ధతులు ఉన్నాయి. ఫ్రాన్స్‌లో పిల్లలు కాగితంపై చేప బొమ్మలను గీసి, ఇతరులకు తెలియకుండా వారి వెనుక అంటిస్తారు; దీనిని 'పోయ్సన్ డ్ ఏప్రిల్' అంటారు. చేప సులభంగా గాలానికి చిక్కుతుంది కాబట్టి, అమాయకులను చేపతో పోలుస్తూ ఈ ఆచారం మొదలైంది. ఇటలీ, బెల్జియంలలో కూడా ఇలాంటి పద్ధతులే కనిపిస్తాయి. స్పెయిన్ మరియు లాటిన్ అమెరికా దేశాల్లో మాత్రం ఏప్రిల్ 1కి బదులుగా డిసెంబర్ 28న 'హోలీ ఇన్నోసెంట్స్ డే' పేరుతో ఇలాంటి వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయితే నేడు టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ఏప్రిల్ ఫూల్ డే కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. డీప్‌ఫేక్ వీడియోలు, కృత్రిమ మేధస్సు (AI) సాయంతో సృష్టించే తప్పుడు సమాచారం సమాజంలో అశాంతికి దారితీసే ప్రమాదం ఉంది. గతంలో కేవలం ఒక చిన్న జోక్ లా ఉండే ఈ అంశం, ఇప్పుడు సైబర్ భద్రత మరియు సమాచార అప్రమత్తతకు పరీక్షగా మారింది. కాబట్టి, సోషల్ మీడియా వినియోగదారులు ఏప్రిల్ 1న వచ్చే వార్తలను గుడ్డిగా నమ్మకుండా, వాటి మూలాలను సరిచూసుకోవడం అత్యవసరం. ఏప్రిల్ ఫూల్ డే అనేది మానవ స్వభావంలోని అల్లరిని, సృజనాత్మకతను మరియు హాస్య చైతన్యాన్ని ప్రదర్శించే ఒక వేదిక. ఇది శతాబ్దాలుగా రూపాంతరం చెందుతూ, క్యాలెండర్ మార్పుల నుంచి డిజిటల్ ప్రాంక్స్ వరకు ప్రయాణించింది. సమాజంలో పెరుగుతున్న యాంత్రిక జీవనంలో ఇటువంటి సందర్భాలు కాస్తంత ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే సమాచార విప్లవ యుగంలో ఉన్న మనం వినోదాన్ని, బాధ్యతను వేరు చేసి చూడలేము. మన హాస్యం ఎదుటివారి కళ్లలో నీళ్లు తెప్పించకూడదు, వారి గౌరవానికి భంగం కలిగించకూడదు. సాంప్రదాయం, సంస్కృతి మరియు ఆధునికతను మేళవిస్తూ, సమాజ నైతిక విలువలను కాపాడుతూ జరుపుకున్నప్పుడే ఈ 'ముగ్ధుల దినోత్సవానికి' ఒక సార్థకత ఏర్పడుతుంది. నవ్వుతూ, నవ్విస్తూ, ఆరోగ్యకరమైన హాస్యంతో ప్రపంచాన్ని మరింత ఆనందమయం చేయడం మనందరి బాధ్యత. అది అప్రమత్తతతో కూడిన ఆనందమైనప్పుడే సమాజం ఆరోగ్యకరమైన దిశలో పయనిస్తుంది. ఏప్రిల్ ఫూల్ కేవలం ఒక మోసపూరిత వినోదం కాదు, అది మనుషుల మధ్య ప్రేమాభిమానాలను పంచుకునే ఒక మధురమైన సందర్భం కావాలి.






రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494


# నేత్రాలను నిర్లక్ష్యం చేస్తే అంధత్వం రావచ్చు !

(01 -07 ఏప్రిల్ "అంధత్వ నివారణ వారోత్సవాలు" సందర్భంగా)

పంచేంద్రియాల్లోకి నేత్రాలు ప్రధానమైనవి మనకు తెలుసు. చూపు మందగిస్తే బతుకు చీకటిమయం అవుతుంది. చూపు కలిగిన వారికి దృష్టి ప్రాధాన్యం పెద్దగా అర్థం కాదు. ప్రపంచవ్యాప్తంగా 2.2 బిలియన్ల ప్రజలు దృష్టి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 10 మిలియన్లకు పైగా భారతీయులు కూడా ఉండడం విచారకరం. రాజస్థాన్, ఎంపీ రాష్ట్రాల్లో అంధత్వ సమస్య ఎక్కువగా ఉన్నది. అంధత్వ నివారణకు తగు జాగ్రత్తలు పాటించడంతో పాటు నేత్ర సంబంధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 01 07 ఏప్రిల్ వరకు దేశవ్యాప్తంగా "అంధత్వ నివారణ వారోత్సవాలు (ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్ వీక్)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. అంధత్వ నివారణ, అంధ పాఠశాలల నిర్వహణ, హక్కుల పరిరక్షణ, నేత్రదాన ఉద్యమాలు, అంధులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పన లాంటి చర్యలు తీసుకోవడం నేటి ప్రభుత్వాల, పౌర సమాజ కనీస బాధ్యత అని తెలపడానికి ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

**రైట్ టు సైట్ మన నినాదం కావాలి:**

నేత్ర ఆరోగ్య ప్రాధాన్యతను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 08 అక్టోబర్ రోజున "ప్రపంచ దృష్టి దినం", మార్చి 07 నుంచి 13 వరకు "ప్రపంచ గ్లకోమా వారం", అక్టోబర్ నెలను "అంధత్వ అవగాహన మాసం"గా పాటించడం జరుగుతున్నది. అంధత్వం మూడు రకాలుగా కనిపిస్తుంది. వీటిలో ట్రకోమా, కాటరాక్ట్, విటమిన్‌ఏ లోపం కారణాలతో అంధత్వ సమస్య ఉత్పన్నం అవుతున్నది. డబ్ల్యూహెచ్‌ఓ చేపట్టిన "రైట్ టు సైట్ (దృష్టి హక్కు)" నినాదంతో అంధత్వ నివారణ చర్యలు కొనసాగుతున్నాయి. విటమిన్‌ఏ లోపం కారణంగా వచ్చే అంధత్వం నివారించదగినదని ప్రభుత్వాలు, ప్రజలు గుర్తించాలి. నేత్ర ఆరోగ్య పరిరక్షణ, నేత్ర రుగ్మతల చికిత్స, దృష్టిదోషం ఉన్న మేధావుల విజయగాథలు, నేత్ర ఈరోగ్య పరిరక్షణ పరిశోధనలు, స్వచ్ఛంద సంస్థల సహకారం లాంటి అంశాల్లో శ్రద్ధ వహించడం వల్ల సత్ఫలితాలు కనిపిస్తాయని తెలుసుకోవాలి. గ్లకోమా, కంటి శుక్లాలు, కండ్ల కలకలకు వైద్యం సకాలంలో అందితే అంధత్వం రాకుండా కాపాడుకోవచ్చు.



**అంధత్వ కారణాలు, నివారణ చర్యలు:**

కంప్యూటర్, ల్యాబ్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ లాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను గంటల తరబడి వాడడంతో నేత్ర సమస్యలు ఉత్పన్నమవుతాయి. అంధత్వ సమస్యలు 80 శాతం వరకు నివారించదగినవే. వయస్సు 50 ఏండ్లు దాటిన వారికి నేత్ర సమస్యలు అధికంగా కనిపిస్తాయి. నేత్ర గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, కంటి గాయాలకు సత్వరమే చికిత్స తీసుకోవడం, తరుచుగా నేత్ర పరీక్షలు చేయించుకోవడం, విటమిన్ ఏ కలిగిన పోషకాహారం తీసుకోవడం, కాటరాక్ట్ చికిత్సలు చేయించుకోవడం, నేత్రాలను కళ్ల అద్దాలతో పరిరక్షించుకోవడం, నేత్ర శుభ్రతను పాటించడం, ముందస్తు లాంటి చర్యలు, పొగాకు వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటి చర్యలు అంధత్వాలను నివారిస్తాయి. విధిగా మరణానంతరం నేత్ర దానం చేయడం తప్పనిసరి అని తెలుసుకోవాలి. మనం మరణించిన తర్వాత కూడా నేత్ర దానంతో మరో జన్మకు అర్థాన్ని, దృష్టిని ఇవ్వవచ్చు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం. కంటి చూపు లేని జీవితం చీకటిమయం. చూపును పరిరక్షించుకోవడం మన చేతుల్లోనే ఉన్నది. తగు జాగ్రత్తలు పాటిస్తే జీవితం రంగుల హరివిల్లు అవుతుంది.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 01.04.2026
www.mudranews.in | @mudranews



పాస్‌వర్డ్‌లను తరచుగా మార్చండి




కొంతకాలానికి ఒకసారి మారిస్తే హ్యాకింగ్ అవకాశాలు తగ్గుతాయి.

# గ్రామ, వార్డు సభలు విజయవంతంగా నిర్వహించాలి

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ అంశంపై సమీక్షించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులో సభలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలతో ప్రభుత్వం అనుసంధానంగా పనిచేస్తూ సంక్షేమ



పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామ, వార్డు సభకు ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల వివరాలతో కరపత్రాలు సిద్ధం చేసి పంపిణీ చేయాలని, గ్రామాలు–వార్డుల అభివృద్ధి ప్రాధాన్యతలు, సమస్యలు గుర్తించి పరిష్కార మార్గాలపై చర్చించాలని సూచించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతి, పరిష్కరించిన పెండింగ్ అంశాల వివరాలు ప్రజలకు తెలియజేయాలన్నారు.

**జిల్లాలో ఏర్పాట్లు పూర్తి**


జిల్లాలో గ్రామ సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. 461 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, 4 మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. సభల నిర్వహణకు అవసరమైన ఫ్లెక్సీలు, షామియానాలు, తాగునీరు, ఎల్ఈడీలు, సౌండ్ సిస్టమ్, తెలంగాణ జాతీయ గీతం వంటి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జీవి శ్యాం ప్రసాద్ లాల్, అమరేందర్, జిల్లా పరిషత్ సీఈఓ దేవా సహాయం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2 నుంచి గ్రామ సభలు

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ఏప్రిల్, 2 నుండి నిర్వహించే గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి, డీపీవో సురేష్ మోహన్, సీపీవో సౌమ్య, సంక్షేమ శాఖల అధికారులు రామరావు, నవీన్ కుమార్ రెడ్డి, కేషు రామ్, పద్మావతి, పీడీ డీఆర్డీఏ శ్రీలత, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, హౌసింగ్ పీడీ చంప్లా నాయక్, డీఈవో సుశిందర్ రావు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను వసూళ్లలో బోడుప్పల్ ముందంజ

**రూ.45 కోట్లు వసూలు**



**బోడుప్పల్, ముద్ర:** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లలో బోడుప్పల్ సర్కిల్ ముందంజలో ఉంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను చెల్లింపుదారులకు చివరి రోజు రూ.86 లక్షలు ఆస్తిపన్ను వసూలైంది. ప్రస్తుత ఆరిక సంవత్సరం ఇప్పటిదాకా డిమాండ్ మేరకు రూ.45 కోట్లు వసూలు చేసినట్టు డిప్యూటీ కమిషనర్ శైలజ తెలిపారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14 సర్కిళ్లలో బోడుప్పల్ సర్కిల్ డిమాండ్ మొత్తంపై అత్యధిక వసూళ్లు సాధించి ముందంజలో నిలిచింది. అలాగే 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెక్కులు "కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్" పేరిట చెల్లించవలసిందిగా ప్రజలకు, గృహ, వాణిజ్య యజమాను దారులకు మున్సిపల్ అధికారి శ్యామ్ సుందర్ తెలిపారు.

## కోడి పందేల స్థావరంపై దాడి



**ముద్ర, గద్వాల:** గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శేఖర్ గౌడ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుమ్మలపల్లి గ్రామం శివారులో కొన్ని రోజులుగా ఓ ముఠా కోడి పందేలు నిర్వహిస్తుంది. మంగళవారం ఉదయం సైతం పందేలు నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో గట్టు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడులో ముగ్గుర్ని అదుపులోకి తీసుకోగా, రూ.7,300 నగదు, ఒక పందెం కోడి, మూడు బైక్ లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## నేటి నుంచి ఎస్సెస్సీ పరీక్ష ప్రశ్నపత్రాల మూల్యాంకనం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ఎస్సెస్సీ పరీక్ష ప్రశ్నపత్రాల మూల్యాంక మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు డీఈఓ రమేష్ కుమార్ వెల్లడించారు. 23 వరకు 1,72,190 ప్రశ్నపత్రాలను మూల్యాంకనం చేయనున్నట్లు తెలిపారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నిర్వించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరం మూల్యాంకనాన్ని మూడు విడతలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ఏప్రిల్ 1 నుంచి 9 వరకు తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితశాస్త్రం సబ్జెక్టుల మూల్యాంకనం, రెండో విడతలో ఏప్రిల్ 10 నుంచి 17 వరకు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టులు, మూడో విడతలో ఏప్రిల్ 17 నుంచి 23 వరకు సాంఘిక శాస్త్రం ప్రశ్నపత్రాల మూల్యాంకనం చేపడతామని వివరించారు. మూల్యాంకనం నిర్వహణకు 92 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 554 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 162 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించినట్లు తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున 16 మంది ప్రత్యేక అధికారులను నియమించామని పేర్కొన్నారు. అదనపు క్యాంప్ ఆఫీసర్‌గా కురుమయ్య, ఎగ్జామినర్‌గా రాజశేఖర్ రావు వ్యవహరిస్తారని తెలిపారు. మూల్యాంకనం విధులకు అర్హర్లు పొందిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని, హాజరు కాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

# గద్వాల పట్టణ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

**ముద్ర , జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జిల్లా కేంద్రమైన గద్వాల పట్టణ అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, పురపాలక సంఘం అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. గద్వాల మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని మంగళవారం చైర్ పర్సన్ జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ మునిసిపాలిటీ ఆస్తిపన్నుల వసూళ్లలో లక్ష్యం కంటే ఎక్కువగానే వసూలు చేయడంతో పర్ఫార్మెన్స్ గ్రాంట్స్ కు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి గద్వాల మునిసిపాలిటీకి రూ.8.5 కోట్ల స్టాంపు డ్యూటీ నిధులు రావాల్సి ఉందని, ఇతర ఆదాయ మార్గాల్లో రూ.23 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనల కట్టుదిట్ట అమలు, పార్కుల నిర్వహణ, పట్టణ సుందరీకరణ, తదితర




అభివృద్ధి పనులు చేయాల్సి ఉందన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలన్నారు. గద్వాల మునిసిపాలిటీ దుకాణాల ఆదాయం కూడా పెరిగేందుకు నిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహించాలని, మునిసిపాలిటీ అవుట్సోర్సింగ్ కార్మికులకు జీతాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, శానిటేషన్, తాగునీటి సరఫరాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు పార్టీలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసి కట్టుగా సహకరించాలన్నారు. గత కౌన్సిల్ సమయంలో గద్వాల పట్టణ అభివృద్ధికి రూ.18 కోట్ల నిధులను ఖర్చు పెట్టడం జరిగిందని, భవిష్యత్తులోనూ గద్వాల మునిసిపాలిటీకి ఎక్కువ నిధులు వచ్చేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. అంతకుముందు గద్వాల మున్సిపాలిటీ బడ్జెట్ ప్రతులను జూనియర్ అకౌంట్స్ అధికారి రాజు చదివి వినిపించారు. 2026–2027 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.24.84 కోట్ల అంచనా ఆదాయాన్ని పేర్కొన్నారు. అలాగే మొత్తం అంచనా ఖర్చు రూ.27.56 కోట్లుగా ప్రస్తావించారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న మున్సిపాలిటీ కార్మికుడు వెంకటరాజును సన్మానించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, వైస్ చైర్మన్ శంకర్, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ చట్టం న్యాయవాదులకు రక్షణ కవచం

**ముద్ర, వనపర్తి:** అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ న్యాయవాదులకు రక్షణ చట్టం కవచం లాంటిదని వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయవాదుల సంఘ భవనంలో మాట్లాడారు. ఈ బిల్లును ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింప చేయడం అభినందనీయమన్నారు, న్యాయవాదులు ఎన్నో రోజుల నుంచి కోరుతున్న ఈ యాక్ట్ ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం అందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి వనపర్తి బార్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ న్యాయవాదులు మోహన్ గౌడ్, నాగేశ్వర్, జనరల్ సెక్రెటరీ వెంకటరమణ, న్యాయ వాదులు పాల్గొన్నారు.

**బిల్లును ఆమోదించడం చారిత్రాత్మకం**

**ముద్ర, తాండూర్:** తెలంగాణ శాసనసభలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడం చారిత్రాత్మక నిర్ణయం కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ జిలాని అన్నారు. ఈ బిల్లును ఆమోదించినందుకు ముఖ్యమంత్రి, మంత్రి మండలి, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యుల పై హింసకు పాల్పడే వ్యక్తులకు 6 నెలల నుంచి 3 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు 25 వేల నుంచి 50 వేల వరకు జరిమానా కూడా విధిస్తారని అన్నారు. న్యాయవాదుల ఆస్తులకు నష్టం కలిగిస్తే, అందుకు సంబంధించిన నష్టాన్ని న్యాయస్థానం ద్వారా నిర్ధారించి పరిహారం అందుతుందన్నారు.

## మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

**ముద్ర, గద్వాల:** విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.27 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించి, మాట్లాడారు. ఇటీవల మెడికల్ లో 8మంది విద్యార్థులు సీట్లు సాధించారని అన్నారు. ఎంతోమంది ఉద్యోగాలను సాధించారన్నారు. కే.టి దొడ్డి మండలంలో సైనిక్ గురుకుల పాఠశాల నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేసి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాకులారంలో కూడా ప్రభుత్వ పాఠశాల త్వరలో భూమిపూజ చేస్తామన్నారు. జిల్లాకు నవోదయ కూడా మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి యాదవ్ వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు, జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి, హెచ్ఎం జహురుద్దీన్, ఉపాధ్యాయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వనపర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

**మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే మెగారెడ్డి**

**ముద్ర, వనపర్తి:** వనపర్తి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి సమావేశం మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ మాధవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 2026–27 ఆర్థిక సంవత్సరంలో వనపర్తి పురపాలికలో రూ. 55.31 కోట్ల ఆదాయం సమకూర నున్నట్లు, సవరించిన అంచనా బడ్జెట్ ను వనపర్తి పురపాలిక కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఇందులో మున్సిపాలిటీలో వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు ప్లాన్, నాన్ ప్లాన్ గ్రాంట్స్ నిధులు ఉన్నాయని, 2025–26 సవరించిన బడ్జెట్, ఇప్పటి వరకు




అయిన ఖర్చులు, 2026–27 ఆర్థిక సంవత్సరంలో అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు బడ్జెట్ వివరాలను సభముందు ఉంచారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనా బడ్జెట్ 53.85 కోట్లు ఉండగా 2026–27 కు 55.31 కోట్లు గా అంచనా వేశారు. ఇందులో 10 శాతం నిధులు మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు గ్రీన్ బడ్జెట్ గా కేటాయించినట్లు చూపించారు. గత సంవత్సరం సవరించిన బడ్జెట్ అంచనాలలో రూ.36.46 కోట్ల ఆదాయం సమకూర్చుకోగా, అందులో నుంచి 28.03 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. రూ.8.43 కోట్లు ఆర్థిక సంవత్సరంలో ఓపెనింగ్ బ్యాలెన్స్ గా చూపించడం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి మాట్లాడుతూ పార్టీలకతీతంగా మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు సమాన నిధులు కేటాయించి అన్ని వార్డులలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, వనపర్తి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్స్‌కు ఎస్పీ సన్మానం



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** పోలీస్ శాఖలో 34 ఏళ్లపాటు క్రమశిక్షణతో, నిబద్ధతతో సేవలందించి మంగళవారం ఉద్యోగ విరమణ పొందుతున్న హెడ్ కానిస్టేబుల్స్ నందూరి విజయ భాస్కర్ రాజు, ఈడిగ నరసింహ గౌడ్‌లకు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇద్దరూ 1992 సంవత్సరంలో సివిల్ కానిస్టేబుల్స్‌గా పోలీస్ శాఖలో చేరి నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ శాఖకు గౌరవాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. అదనపు ఎస్పీ కె. శంకర్, అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. ప్రదీప్ కుమార్, శాంతినగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టాటా బాబు, గద్వాల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. శ్రీను, అలంపూర్ ఎస్సై రామకృష్ణ, అయిజ ఎస్సై పి. శ్రీనివాస్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మహావీర్ జయంతి




**ముద్ర, మల్కాజిగిరి:** సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో శ్రీ మహావీర్ జైన్ సేవా సంఘ్ కోర్ కమిటీ సభ్యులు నిర్వహించిన భగవాన్ మహావీర్ 2625వ జన్మ కళ్యాణక్ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్రావు , మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవాన్ మహావీర్ బోధనలు రెండు వేల సంవత్సరాలకు పైగా మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండే శ్రీ మహావీర్ జైన్ సేవా సంఘ్ నిర్వహిస్తున్న ధార్మిక, సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని కొనియాడారు. మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ ప్రాంతాల్లోని జైన్ సమాజం స్థానిక ఆర్థికాభివృద్ధికి, సామాజిక విలువలకు మార్గదర్శకులుగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహావీర్ జైన్ సేవా సంఘ్ కోర్ కమిటీ సభ్యులు ప్రదీప్ సురానా పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** బిజినపల్లి మండల పరిధిలోని నందివడ్డేమాన్ గ్రామంలో వెలిసిన శ్రీజేస్టా మాత సమేత శనీశ్వర స్వామి ఆలయ 26వ వార్షికోత్సవంలో భాగంగా మొదటి రోజు సాయంత్రం ఆలయ చైర్మన్ గోపాలరావు దంపతులు, కంచే రాజేష్ దంపతులు వేద మూర్తులైన బ్రాహ్మణులచే శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. శివునికి మహాన్యాస పూర్వకంగా రుద్ర అభిషేకం, మహానందీశ్వర స్వామికి అభిషేకం,



పూజలు చేశారు. అమ్మవారికి సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథ శాస్త్రి, ఆలయ అర్చకులు, భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## ముందస్తు ఫీజులను అరికట్టాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి ముందస్తు ఫీజులు వసూలు చేయడాన్ని వెంటనే అరికట్టాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ నాగర్ కర్నూల్ నాయకులు ఎంఈవో కుర్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. నగర సంయుక్త కార్యదర్శి శివ మాట్లాడుతూ పాఠ్య పుస్తకాల పేరుతో, విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

## స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన

**ముద్ర, గద్వాల:** యువత ఉద్యోగాన్వేషకులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాల్సిన అవసరముందని జిల్లా ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ టి. రామలింగేశ్వర గౌడ్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థులకు స్వయం ఉపాధి పథకాలు, అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. మీనాక్షి ఎంట్రప్రెన్యూర్ డెవలప్మెంట్ సెల్ జిల్లా మేనేజర్ దయాకర్, అసిస్టెంట్ మేనేజర్ శ్యామల, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎం. సమత, ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్ బి. జగన్ మోహన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఉప్పల్ కారిడార్ పై రాజకీయ వివాదం

**ముద్ర, కాప్రా:**

ఉప్పల్‌లో నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ కారిడార్‌కు మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ నిర్ణయాన్ని బీజేపీ నాయకులు వ్యతిరేకించడంపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద బండారి రాజిరెడ్డి ఎలివేటెడ్ కారిడార్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజిరెడ్డి ఉప్పల్ తొలి ఎమ్మెల్యేగా, కాప్రా మున్సిపల్ చైర్మన్‌గా చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ విషయంపై బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శలు చేయడం ఆయన అవగాహన లోపాన్ని సూచిస్తుందని వ్యాఖ్యానించారు.

**మాజీ ప్రధాని వాజపేయి పేరు పెట్టాలి**

ఉప్పల్ నారపల్లె ఎలివేటెడ్ కారిడార్ కు భారత మాజీ ప్రధాని దివంగత అటల్ బీహార్ వాజపేయి పేరు నామకరణ చేయాలని బిజెపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర నిధులతో సాగుతున్న పనులకు రాష్ట్ర ప్రభుత్వం పేరు పెట్టే అధికారం ఎక్కడ కూడా లేదని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రూ.650 కోట్ల నిధులతో కేంద్ర ప్రభుత్వం తాను ఉప్పల్ ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి చేతులు మీదుగా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కారిడానికి సంబంధం లేని వ్యక్తుల పేర్లు పెట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

## పౌల్ట్రీ ఫామ్‌లో వింత వ్యాధి కలకలం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పెద్దకొత్తపల్లి మండలంలో ఓ పౌల్ట్రీ ఫామ్‌లో వింత వ్యాధి కలకలం రేపింది. మండలానికి చెందిన రైతు తాళ్ళ వెంకటస్వామికి చెందిన ఫామ్‌లో సుమారు 4,500 కోళ్లు మృతి చెందడంతో ఆందోళన నెలకొంది. జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జ్ఞానశేఖర్, మండల పశువైద్యాధికారిణి కల్పన మంగళవారం ఫామ్‌ను సందర్శించి నమూనాలను సేకరించి పరీక్షల కోసం మహబూబ్‌నగర్‌కు పంపించారు. నివేదిక వచ్చిన తర్వాతే వ్యాధి కారణాన్ని ఖచ్చితంగా చెప్పగలమని స్పష్టం చేశారు.

## పార్టీ కోసం కష్టపడే వారికే సముచిత స్థానం

**ముద్ర, కూకట్ పల్లి:** పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారికే తగిన గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. నాయకులు ఎండి మోయిజ్, రాష్ట్ర ఇంచార్జ్ భవ్య, రమ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు బొమ్మక అజయ్, ఇంచార్జులు రామ్ రెడ్డి, హరిప్రసాద్, సల్మాన్, సలీం పాల్గొన్నారు.

**పాస్‌వర్డ్ మేనేజర్ ఉపయోగించండి**
గుర్తుంచుకోవడం కష్టమైతే సేఫ్‌గా స్టోర్ చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది.

# ఆధ్యాత్మిక కేంద్రంగా బాసర

- **గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు**
- **6న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన**
- **రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవా దాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఈ నెల 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి సమీక్షించారు. పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు. దేవాలయ కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సి ఎం పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మతు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయ రామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిధులు మంజూరు చేయండి

- **మంత్రికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వినతి**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
జగిత్యాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని హైదరాబాద్ లోని వారి కార్యాలయంలో కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. జగిత్యాల నియోజకవర్గంలో అనేక వంతెనలు చెడిపోయాయని, అదే విధంగా రామాజీపేట, రాయికల్, పెంబట్ల బ్రిడ్జ్ ల పని పూర్తి అయినా గాని వాటి అప్రోచ్ రోడ్డు పూర్తి కాలేదని, పలు చోట్ల రోడ్లు రెన్యూవల్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రిని కోరారు. సారంగాపూర్‌పోతారం, జగిత్యాలఅంతర్గం నూతన రోడ్లు కావాలని, నూతనంగా కొన్ని బ్రిడ్జ్‌లు గోవిందపల్లి బ్రిడ్జ్, నర్సింగ పూర్ బ్రిడ్జ్, పెరకపల్లి బ్రిడ్జ్, లో లెవెల్ బ్రిడ్జి లు రాయికల్, సారంగాపూర్ మండలంలో బ్రిడ్జిలు ఉన్నాయని, కొత్త వాటికి టెండర్ పిలవాలని మంత్రికి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ కు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# ఎస్పీ కార్యాలయంలో స్కోచ్ సంబరాలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని "పోలీస్ అక్క" (నారిశక్తి) కార్యక్రమం జాతీయ స్థాయి స్కోచ్ అవార్డు సాధించిన నేపథ్యంలో ఎస్పీ జానకి షర్మిల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఎస్పీ డా.జి.జానకి షర్మిల హాజరై, పోలీస్ అక్క లతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. పోలీస్ అక్క కార్యక్రమం మహిళా పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో నడిచే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం. ఇందులో భాగంగా బాలికలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, మహిళల భద్రత, సైబర్ సెక్యూరిటీ, పోక్సో చట్టం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో పెట్రోలింగ్, డయల్ 100 ద్వారా అత్యవసర సేవలు అందిస్తున్నారు. పోలీస్ అక్కలు కె జీ బి వి పాఠశాలల్లో నెలకోసారి రాత్రి బస చేసి విద్యార్థినుల సమస్యలు విని, కౌన్సిలింగ్ అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 7,000 మంది విద్యార్థినులు, మహిళలు నేరుగా ప్రయోజనం పొందారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన మహిళా పోలీస్ సిబ్బందిని ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అనూప్ రావు



**కోరుట్ల, ముద్ర:**
భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జగిత్యాల జిల్లా కోరుట్ల కు చెందిన డా. వై.అనూప్ రావు ను నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు నియామక పత్రాన్ని అందించారు. తన నియామకానికి సహకరించిన ఇందురు పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు కు అనూప్ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, బిజెపి పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు తిరుమల వాసు, రుద్ర సుజాత, కలాల రాధ సాయిచందు, గూగులోతు శ్రీకాంత్, కోరుట్ల మండలాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
మౌలిక వసతుల కల్పనలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని నిర్మల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. నిర్మల్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అధ్యక్షతన జరిగింది ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పట్టణంలో మౌలిక వసతుల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ బడ్జెట్ సమావేశం లో పురపాలక సంఘానికి వచ్చే ఆదాయ వ్యయాలపై చర్చ జరిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై చర్చలు జరిపారు. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతులు, శానిటేషన్, పారిశుధ్యం, డ్రైనేజి, రహదారుల నిర్మాణం, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు.

# మహిళలకు వరం మహాలక్ష్మి

- **ఉచిత ఆర్టీసీ ప్రయాణం ఒక వరం**
- **పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలి**
- **కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**ముద్ర, కరీంనగర్ :**
రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని, ఇది మహిళలకు వరంగా మారిందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఆర్టీసీలో మహాలక్ష్మి కింద 290 కోట్ల ఉచిత ప్రయాణం ద్వారా పదివేల కోట్ల ప్రయాణ చార్జీల ఆదా అవడంతో కరీంనగర్ బస్టాండ్ లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ




సౌకర్యం వల్ల మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందడమే కాకుండా, ఉపాధి, విద్య, వైద్యం వంటి రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో ఈ పథకంపై మరింత అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. జిల్లాలో ఈ పథకం సక్సెస్‌ఫుల్‌గా అమలవుతూ.. మహిళల సాధికారతకు బలమైన వేదికగా నిలుస్తోందని కలెక్టర్ వెల్లడించారు. కరీంనగర్ జిల్లాలో మహాలక్ష్మి పథకం ప్రారంభించినప్పటి నుంచి 6.91 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఉచితంగా ప్రయాణించారని, మహిళలు రూ.308.84 కోట్ల లబ్ధి పొందారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా ప్రయాణికులను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, ఆర్డీఓ కే మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూపా రాణి, ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలోమన్, కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు పి మల్లేశం, ఎస్ భూపతిరెడ్డి, వన్ డిపో మేనేజర్ విజయ మాధురి, పర్సనల్ ఆఫీసర్ సంపత్, అకౌంట్స్ ఆఫీసర్ రవికుమార్, పలువురు ఆర్టీసీ అధికారులు సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**గొప్ప ఆలోచన..**

సీఎం రేవంత్ రెడ్డి గొప్ప ఆలోచన చేసి మహాలక్ష్మి పథకానికి రూపకల్పన చేశారు. మహిళలు, విద్యార్థినులు, విద్యా ఉపాధి కోసం ఎక్కడికైనా వెళ్లేందుకు ఆర్టీసీ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. దీంతో డబ్బు ఆదా అవుతుంది.

**- జమున, అంగన్‌వాడీ కార్యకర్త**

**మహిళల ఆర్థిక అభివృద్ధి..**

మహిళల ఆర్థిక అభివృద్ధిలో మహాలక్ష్మి పథకం కీలకపాత్ర పోషిస్తోంది. మహిళలు ఏ అవసరం ఉన్న ఈ పథకాన్ని వాడుకుంటున్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ఈ పథకంతో బలమైన అడుగు పడుతున్నది.

**- బండారి రేణుక, టీఎల్ఎఫ్ ఓబి పట్టణ సమైక్య మెప్మా**

# నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- **మూడు విడతల్లో వాల్యుయేషన్**
- **ఏప్రిల్ 23న పూర్తి**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ రెండో వారంలో ముగియనున్న నేపథ్యంలో అధికారులు మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో ఈ మూల్యాంకనం ఏప్రిల్ 1న ప్రారంభం కానున్నది. జిల్లా విద్యా శాఖ అధికారి దర్శనం భోజన్న క్యాంప్ ఆఫీసర్ గా వ్యవహరించనున్నారు. అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్ గా ఏసీజిఇ ముదారపు పరమేశ్వర్ వ్యవహరిస్తారు. సమాధాన పత్రాల కోడింగ్ కోసం 40 మంది శిక్షణార్థం విద్యార్థులను నియమించారు. అలాగే 66 మంది సీనియర్లను చీఫ్ ఎగ్జామినర్లుగా, స్కూల్ అసిస్టెంట్ స్థాయి సిబ్బంది 374 మందికి సహాయ ఎగ్జామినర్లుగా నియమించారు. ఇక మార్కుల తుది పరిశీలన కోసం 132 మంది ఎస్జీటీ లను ప్రత్యేక సహాయకులుగా నియమించారు. వీరంతా ఏప్రిల్ 1 ఉదయం విధుల్లో చేరాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సారి ప్రతి పరీక్షకు మధ్య 2 నుంచి 3 రోజుల వ్యవధి ఉన్న నేపథ్యంలో గతానికి భిన్నంగా ఈ సారి మూడు విడతలుగా మూల్యాంకనం నిర్వహించనున్నారు. ఏప్రిల్ 1 నుంచి 9 వరకు తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. అలాగే భౌతిక రసాయన శాస్త్రం, జీవశాస్త్రం మూల్యాంకనం ఏప్రిల్ 10న ప్రారంభమై 17న ముగియనుంది. ఇక చివరగా సాంఘిక శాస్త్ర మూల్యాంకనం 17 నుంచి 23 వరకు జరగనుంది. ఆయా జిల్లాల నుంచి మూల్యాంకనానికి కేటాయించిన సమాధాన పత్రాలు చూస్తే తెలుగు 12,213 పత్రాలు, హిందీ అత్యల్పంగా 8,071, ఆంగ్లం 25,184, గణితం 26,967, భౌతిక రసాయన శాస్త్రం 25,910, జీవశాస్త్రం 12,085, సాంఘిక శాస్త్రం 25,856 పత్రాలు జిల్లాకు కేటాయించారు.



**విధులకు హాజరు కాకుంటే చర్యలు**
విధులు కేటాయించిన సిబ్బంది తప్పని సరిగా సకాలంలో విధులకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి దర్శనం భోజన్న సూచించారు. విధులకు హాజరుకాని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆయన పేర్కొన్నారు.

**- డీఈఓ భోజన్న**

# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సత్యనారాయణ గౌడ్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా వల్లకొండ సత్యనారాయణ గౌడ్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన గతంలో నిర్మల్ మండల పరిషత్ అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన క్రియాశీల పాత్ర పోషించారు. నిబద్ధత కలిగిన నాయకునికి ఈ పదవి దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఇందిరమ్మ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- **జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

**కోరుట్ల, ముద్ర:**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజు జిల్లా కలెక్టర్ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలోని నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంజూరైనా ఇందిరమ్మ ఇళ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మించుకునే ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వం రూ. 5 లక్షలు అందజేస్తుందని తెలిపారు. ఇటుక, కంకర, బేస్‌మెంట్ పై ధరల నియంత్రణ, ఇళ్ల లబ్ధిదారులకు ధరలు అనుగుణంగా ఉండేలా అధికారులను కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గడువులోపు వారికి కేటాయించిన టార్గెట్‌లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఆర్థిక పరమైన సమస్యలుంటే ఐకేపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలని అన్నారు. అనంతరం పలు మార్కింగ్, బేస్‌మెంట్, స్లాబ్ లెవెల్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇళ్ల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహారావు, హౌసింగ్ పిడి ప్రసాద్, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# నెహ్రూ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించాల్సిన బాధ్యత బల్దియాదే

**ముద్ర , కరీంనగర్ :**
స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా కరీంనగర్ నగరం సవరన్ స్ట్రీట్ నెహ్రూ చౌక్ వద్ద మునిసిపల్ అధికారులు అయిదు సంవత్సరాల క్రితం తొలగించిన మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించాల్సిన బాధ్యత బల్దియాదే అని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్ గుర్తు చేశారు. ఈ అంశంపై కమీషనర్ కు, కలెక్టర్ కు పలుమార్లు విన్నవించుకున్నా, బల్దియా ముందు గత మేయర్ పై ఒత్తిడి తెచ్చే కార్యక్రమాలు చేసినా ఫలితం లేకుండా పోయిందని అన్నారు.

## రైతులను ఆదుకోండి..

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రైతులు భారీగా నష్టపోయారని, వారికి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బిఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కురిసిన వర్షాలు, బలమైన గాలుల కారణంగా జిల్లాలో వివిధ రకాల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముదోల్ నియోజక వర్గాల్లో మామిడి, నువ్వు, పసుపు, మొక్కజొన్న, వరి తదితర పంటలు నేలకొరిగి రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం స్పందించి సంబంధిత అధికారులతో పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరా కు రూ.60 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# మహిళా సాధికారతకు మహాలక్ష్మి భరోసా

- **కలెక్టర్ రాజర్షి షా**



**బోథ్, ముద్ర:**
మహిళల ఆర్థిక సాధికారత, స్వేచ్ఛా ప్రయాణం, జీవన ప్రమాణాల పెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ఒక విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకం కింద సుమారు 2.55 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నరని, ఛార్జీల రూపంలో ఆదిలాబాద్ డిపో 106 కోట్లు, ఉట్నూరు డిపో 28 కోట్ల రూపాయలకు పైగా ఆదా చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మెప్మా పిడి రాజు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డిఎం ప్రతిమ, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్టీసీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టులకు నూతన జీవం

- **మంత్రి చొరవతో విడుదలైన నిధులు**
- **అడ్లూరిని సన్మానించిన సీఎంఎస్టీఈఐ లబ్ధిదారులు**



**ముద్ర, కరీంనగర్ :**
గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎంఎస్టీఈఐ (చీఫ్ మినిస్టర్ షెడ్యూల్డ్ ట్రైబల్స్ ఇంటర్ ప్రెనిషిప్ అండ్ ఇన్నోవేషన్) పథకం కింద నిలిచిపోయిన ప్రాజెక్టులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఊపిరి పోసింది. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను విడుదల చేయడంతో లబ్ధిదారుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. పథకం పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 200 మంది అభ్యర్థులు ఎంపిక అయ్యారు. అందులో 18 మంది లబ్ధిదారులకు తుది ప్రొసీడింగ్స్ అందజేశారు. ప్రాజెక్టుల గ్రౌడింగ్ కు అవసరమైన సబ్సిడీ విడుదలలో ఆలస్యం కారణంగా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ. 50 కోట్లలో భాగంగా ఒక త్రైమాసికానికి సంబంధించిన రూ.12.30 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. రూ. 8.16 కోట్లు 18 మంది లబ్ధిదారులకు సబ్సిడీగా అందజేశారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న నిధులు విడుదల కావడంతో లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారులు మంగళవారం సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలిపి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. గిరిజన యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఇది ఒక కీలక అడుగని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి గారి ఆలోచనతో రానున్న రోజుల్లో గిరిజనుల ఆర్థిక అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని అవసరమైన నిధులు విడుదల చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ సంతోష్, జీఎం శంకర్ రావు, స్టేట్ మిషన్ మేనేజర్ లక్ష్మీ ప్రసాద్, డీజీఎం రవి కుమార్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 01-04-2026
www.mudranews.in | @mudranews



2-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ (2FA) ఆన్ చేయండి
అదనపు భద్రత కోసం OTP లేదా యాప్ వెరిఫికేషన్ ఉపయోగించండి.



## ఎస్ఐఆర్ కు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర ప్రతినిధి, భువనగిరి :

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. మంగళవారం మినీ మీటింగ్ హాల్ లో ఎస్ఐఆర్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు, రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. త్వరలో నిర్వహించబోవు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గూర్చి కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు, జిల్లాలోని వారి పరిధిలో గల బూత్ లలో ప్రతి ఇంటింటికి వస్తారని వారితో ఒక జత ఎన్యూమరేటర్ ఫారం ని తీసుకువచ్చి ప్రతి ఓటరు వివరాలు అడిగి తెలుసుకుని వాటిని తగు సమాచారంతో నింపి, ఒక ప్రతిని వారి వెంట తీసుకొని మరొక ప్రతిని ఓటరుకు అందజేస్తారని అన్నారు.

ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హుజుర్ నగర్ అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్




ముద్ర ప్రతినిధి, కోదాడ:

నూతన పాలకవర్గం హుజుర్ నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ కోరారు. హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026-27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం మున్సిపాలిటీలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి సత్ఫలితాలు రాబట్టాలని కోరారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించినట్లు వివరించారు. బడ్జెట్ లో ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పరిశుభ్రత, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలన్నారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆర్డీఓకు సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీలలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల స్వేచ్ఛా ప్రయాణం - తెలంగాణకు గర్వం




- అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్ రావు

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

మహిళల స్వేచ్ఛా ప్రయాణం – తెలంగాణకు గర్వమని జిల్లా అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్ రావు అన్నారు. మహాలక్ష్మి పథకం మహిళలకు ఉచిత ఆర్ టీసీ బస్ ప్రయాణం విజయోత్సవాలు పురస్కరించుకొని మహిళలు ఆదా చేసిన ప్రయాణ ఖర్చు రూ.10,012 కోట్లు దాటిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని భువనగిరి బస్ స్టాండ్ వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం లాగే ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఉచిత సేవలను ఉపయో గించుకోవాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మహ్మద్ అవైస్ చిస్తీ, వైస్ చైర్మెన్ పోతం శెట్టి మంజుల వెంకటేష్, ఇంచార్జీ మున్సిపల్ కమీషనర్ కొండల్ రావు, యాదగిరిగుట్ట డిపో మేనేజర్ సి.ఎచ్ మురళీకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ లో మూడు నెలల రేషన్ పంపిణీ

ముద్ర ప్రతినిధి, భువనగిరి:

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల రేషన్ పంపిణీని ఏప్రిల్ నెలలో అందజేస్తున్నట్లు కలెక్టరు (పౌరసరఫరాలు) వెంకా రెడ్డి తెలిపారు. లబ్ధిదారులు రేషన్ షాపుల నుండి మూడు నెలల బియ్యం కోటాను ఏప్రిల్ లోనే పొందాలని సూచించారు. జిల్లాలో ఉన్న 2,50,789 రేషన్ కార్డులకుగాను 15,031.035 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించినట్లు తెలిపారు. అనంతరం వలిగొండ మండలం లోని గన్ని గోదాం, బఫర్ గోదాం, పెట్రోల్ బంకు, వాసవి రైస్ మిల్ లను తనిఖీ చేశారు.



## ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి




ముద్ర, తుంగతుర్తి:

ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉచిత వైద్యం, నెలకు 18 వేల జీతం ప్రకటించాలని మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలో ఆశా వర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకురాలు జయమ్మ మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాలుగా ఆశా కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనసుతో స్పందించి ఆశా కార్యకర్తల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల స్థాయి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరల్డ్ టీచర్స్ క్విజ్-2026 విజేత ధనుష్ రెడ్డి

ముద్ర ప్రతినిధి , కోదాడ:



వరల్డ్ టీచర్స్ క్విజ్-2026 పోటీలో కోదాడకు చెందిన ఉస్తాల ధనుష్ రెడ్డి విజేతగా నిలిచారు. గ్రేకాప్స్ సంస్థ మరియు టీచర్స్ ట్రైబ్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఉపాధ్యాయులకు 6వ వరల్డ్ టీచర్స్ క్విజ్-2026 పోటీలను బెంగళూరు వేదికగా నిర్వహించింది. ఈ పోటీలు మార్చి 1వ తేదీ నుండి 28 వరకు ఆన్లైన్ వేదికగా వివిధ దశలలో నిర్వహించారు. ఈ పోటీలో 11 వేల మంది పైగా ఉపాధ్యాయులు పాల్గొ న్నారు. నాలుగు విడతల్లో పోటీలు నిర్వ హించారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన నలుగురు ఉపాధ్యాయులు ఫైనల్ పోటీ లకు ఎంపికయ్యారు. ఫైనల్ లో కోదాడ తేజ విద్యాలయకు చెందిన ఉస్తాల ధనుష్ రెడ్డి విజేతగా నిలిచి రూ.20 వేలు గెలుచుకున్నారు.

## బీఏఐ జాతీయ ఉపాధ్యక్షుడిగా వేముల సత్యమూర్తి




ముద్ర, హన్మకొండ:

నిర్మాణ రంగంలో విశేష అనుభవం కలిగిన ప్రముఖ పారిశ్రామికవేత్త వేముల సత్యమూర్తి, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (BAI) జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ముంబాయిలోని బీఏఐ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. 1979లో సాధారణ కాంట్రాక్టర్‌గా ప్రారంభమైన ఆయన ప్రయాణం, నేడు ప్రముఖ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థగా ఎదిగిన శ్రీ సత్యసాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వరకు చేరుకుంది. సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, కాలువల నిర్మాణంలో ఆయన సంస్థ ప్రత్యేక గుర్తింపు పొందింది.గతంలో బీఏఐ వరంగల్ సెంటర్ చైర్మన్‌గా, రాష్ట్ర చైర్మన్‌గా పనిచేసిన సత్యమూర్తి, అసోసియేషన్ బలోపేతానికి కృషి చేశారు. కొత్త బాధ్యతలపై స్పందిస్తూ నిర్మాణ రంగ సమస్యల పరిష్కారం, ముడి సరుకుల ధరల నియంత్రణ, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బిల్డర్లు, ప్రజాప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## రేపు మోత్కూర్ నియోజకవర్గ సాధన సమితి ప్రత్యేక సమావేశం

ముద్ర,మోత్కూర్:

ఏప్రిల్ 2న మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎల్ఎన్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ప్రత్యేక సమావేశం నిర్వస్తున్నట్లు మోత్కూర్ నియోజకవర్గ సాధన సమితి సభ్యులు తెలిపారు. ఈ సమావేశానికి మోత్కూర్, గుండాల, ఆత్మకూర్, అడ్డగుడూర్ మండలాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, యువత, విద్యార్థి, ఉద్యోగ, మహిళా సంఘాల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సాధన నూతన కమిటీ ఎన్నికతో పాటు, భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీల శ్రేయస్సుకే పౌరహక్కుల కార్యక్రమం

- జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేష్



ముద్ర, మోత్కూర్:

ఎస్సీ, ఎస్టీల శ్రేయస్సు కోసమే పౌర హక్కుల దినోత్సవమని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేష్ అన్నారు. మోత్కూర్ మండలంలోని ముషిపట్ల గ్రామంలో ఆర్ఐ కాసోజు రవి ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుల మత జాతి లింగ బేధాలు లేకుండా గ్రామంలోని ప్రతి ఒక్కరూ కలసి ఉండాలని, కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన డబ్బులు వెంటనే అందజేయాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులల్లో బాధితులకు ఇవ్వాల్సిన పరిహారలు ప్రభుత్వం వెంటనే అందజేయాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వలు ఎస్సి ఎస్టీలకు సంబందించి అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. అనంతరం ఇటీవలే ఆర్ఐగా బాధ్యతలు తీసుకొని తొలిసారి ఈ కార్యక్రమం నిర్వహించిన కాసోజు రవికి శుభాకాంక్షలు తెలియచేసి శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైళ్ల నర్సిరెడ్డి, ఎస్ఐ సతీష్, ఏపీఓ జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ ఆర్ ఐ రవీంద్ర చారి, ఏపీఎం పకీరయ్య, పంచాయతీ సెంక్రెటరీ యాదగిరి, జిపిఓ ప్రవీణ్, సీసీ భాస్కర్, హెచ్ డబ్ల్యు ఓ అశోక్, (హెచ్ఎ) ఎఫ్ మంజుల, ఏడబ్ల్యు టి భార్గవి, ఏఎస్ఐ శ్రీనువాస్, ఉప సర్పంచ్ నోముల అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మత్స్యగిరి, విబికే దేవేంద్ర, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్




ముద్ర, మోత్కూర్:

దేశంలో ఉపాధి అవకాశాల స్వరూపం మారుతున్న సమయంలో ప్రైవేట్ రంగం లో రిజర్వేషన్ల అమలు చేయాలని డీహెచ్ పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పిఎస్) భువనగిరి జిల్లా 2వ జిల్లా మహా సభలు కాసపాక దయాకర్ అధ్యక్షతన మోత్కూర్ కెఆర్ భవన్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మారుపాక అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ భార త రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టం గా చెబుతున్నప్పటికీ, ప్రైవేట్ రంగంలో ఈ సూత్రాలు అమలుకావడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలుకు చట్టం తీసుకురావాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ సమావే శానికి సీపీఐ జిల్లా యనాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శిలు బొలగని సత్య నారాయణ, చేడే చంద్రయ్య, మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి, నాయకులు ఎఐవై ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్య దర్శి శాంతికుమార్, ఇంజ హేమలత, కిష్టమ్మా, జిట్టా రాములు, న్యాతకాని కిష్టమ్మా, భాగ్యమ్మ, కట్ల యాదగిరి, చెడే సుందర్, బాల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## తుంగతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్ష రేసులో రేగటి రవి

- యువ నాయకత్వం వైపు అధిష్టానం మొగ్గు..
- యువ కాంగ్రెస్ నాయకుడు, పారిశ్రామికవేత్తకు ప్రాధాన్యం



ముద్ర, తుంగతుర్తి:

తుంగతుర్తి నియోజకవర్గానికి గుండెకాయ లాంటి తుంగతుర్తి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి పోటీ తీవ్రస్థాయిలో కనిపిస్తోంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పదవికి కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకులు తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ అందరిని కలుపుకుపోయే వ్యక్తి కోసం కాంగ్రెస్ అధిష్టానం అన్వేషిస్తుంది. ముఖ్యంగా బండ రామారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ, యువకుడు, పారిశ్రామికవేత్త రేగటి రవి పేరు మండల పార్టీ అధ్యక్ష పదవి కోసం ప్రముఖంగా వినవస్తోంది.

బండ రామారం గ్రామంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో గుర్తింపు ఉన్న నాయకుడు రేగటి రవి కావడం, అలాగే తుంగతుర్తి ఎమ్మెల్యేకు, మాజీ డీసీసీ అధ్యక్షుడు రైతు కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్ కు సైతం సన్నిహితుడు, ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్యకు సైతం ఆది నుంచి తెలిసిన వ్యక్తిగా రేగటి రవికి మంచి పేరు ఉంది.

తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక స్థానం ఉన్న ఏఐసీసీ మెంబర్ రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆశీస్సులు కూడా రేగటి రవికి ఉంటాయని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా తుంగతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పోటీ వీరిద్దరి మధ్యనే ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. రేగటి రవి బండ రామారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ద్వారా మంజూరు చేయించి కొన్ని పనులు ఇప్పటికే పూర్తి చేశారు. బండ రామారంలో గ్రామ పంచాయతీ భవనం రూ.20 లక్షల వ్యయంతో పూర్తి కాగా గ్రామంలో అంతర్గత రోడ్లను ఇప్పటికే సుమారు రూ.15 లక్షల నిధులతో పూర్తి చేసినట్లు తెలుస్తోంది. మరో రూ.10 లక్షల సీసీ రోడ్ల మంజూరికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. రేగటి రవి కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి మండల అధ్యక్షుడిగా ఎంపికైనట్లయితే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి అవకాశం ఉంటుందని, అందరి నాయకులకు సన్నిహితంగా ఉండే రేగటి రవికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మండల కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రం కూడా తుంగతుర్తి కావడంతో బలమైన వ్యక్తి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా ఉండాలని కాంగ్రెస్ వర్గాల మాటగా తెలుస్తోంది.

ముఖ్యంగా అందరిని కలుపు కుపోతూ పార్టీని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఎలాంటి వర్గ విభేదాలకు తావు లేకుండా ఉండాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. తుంగతుర్తి మండల పార్టీ అధ్యక్ష పదవి రేగటి రవికి లభిస్తుందా..? లేదా..? అనేది త్వరలోనే తెలుస్తుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మండలంలో మెజార్టీ కాంగ్రెస్ నాయకులు సైతం రేగటి రవికి అండగా నిలుస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా అధినాయకత్వం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో వేచి చూడాల్సి ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



సందేహాస్పద లింక్స్‌పై క్లిక్ చేయవద్దు
ఫిషింగ్ లింక్స్ ద్వారా డేటా దొంగిలించే అవకాశ ముంది.




## గ్రామసభలు సమర్థవంతంగా నిర్వహించాలి

- పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి : కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహణ



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జిల్లా స్థాయి ఎంపికలు మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 31మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రమేష్ గంగాల ఆధ్వర్యంలో ఎంపికలు చేపట్టారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కోసం జిల్లాలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థి, విద్యార్థినులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. అర్హత సాధించిన వారు ఏప్రిల్ 27 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికల్లో పాల్గొనాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యార్థుల ఎంపిక నిర్వహణలో పీఈటీలు శ్రీనివాస్ రావు, మాధవ రెడ్డి, మధుసూదన్, శ్యాం, దేవేందర్ రెడ్డి, రవి, ప్రదీప్ రెడ్డి, సత్యం, దాసరి మధు, శంకర్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో విద్యా అంశాలపై నిర్లక్ష్యం : ఏబీవీపీ ఆగ్రహం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**




అసెంబ్లీలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల వంటి కీలక విద్యా అంశాలపై చర్చ జరపకుండా ఇతర అంశాలపై సమయం కేటాయించడం దురదృష్టకరమని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నేతలు విమర్శించారు. సంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సావుల ఆదిత్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఇప్పసారాపై చర్చ జరపడానికి చూపుతున్న ఆసక్తి, విద్యారంగ సమస్యలపై చూపడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగపడే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం వెంటనే మేల్కొని విద్యారంగానికి కేటాయించిన 8.2 శాతం నిధులను పెంచి కనీసం 15శాతానికి చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మహేష్, సుధీర్, శివ, రంజిత్, తనుజ్ పాల్గొన్నారు.

## గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్, భరోసా కేంద్రాల తనిఖీ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**



జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర మార్గదర్శకత్వంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మంగళవారం సంగారెడ్డిలోని గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్, భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భరోసా కేంద్రాన్ని సందర్శించే బాధితులకు తక్షణమే న్యాయపరమైన సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. పోక్సో చట్టం మరియు మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ అవసరమైన న్యాయ సహాయం అందించాలని సూచించారు. లైంగిక నేరాలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి వారి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్యం, సంక్షేమంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎవరికైనా న్యాయ సంబంధిత సమస్యలు ఉన్నట్లయితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి కార్యాలయాన్ని సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్రం అధికారులు, ఓల్డ్ ఏజ్ హోమ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతికి పటిష్ట పోలీసు బందోబస్తు

- ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**




హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లాలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని హనుమాన్ దేవాలయాలు, ఊరేగింపు మార్గాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించనున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని భక్తులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలు, ఇతరులను కించపరిచే ప్రవర్తన, అనవసర గొడవలకు పాల్పడితే సంబంధితులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

# గ్రామసభలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల ఏప్రిల్ 2వ తేదీ నుంచి జిల్లాలో నిర్వహించనున్న గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి తదితరులతో కలిసి నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశంలో గ్రామసభల ఏర్పాటుపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామసభ ఉదయం 10 గంటలకు ప్రారంభించాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వివరాలను ముందుగానే సిద్ధం చేయాలని, ప్రతి పథకం ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభల్లో వ్యవసాయ శాఖకు సంబంధించిన రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, యాంత్రీకరణ పథకాలు, అలాగే ఆహార భద్రత కార్డులు, రేషన్ కార్డుల ద్వారా ఇంటింటికి సన్న బియ్యం పంపిణీ, చేయూత, మహాలక్ష్మి, గృహజ్యోతి, మహిళాశక్తి, ఎస్‌హెచ్‌జీ రుణాలు, ఉపాధి హామీ పనులు తదితర ప్రభుత్వ పథకాలపై పూర్తి సమాచారం సిద్ధంగా ఉంచాలని తెలిపారు. మహిళలు, వృద్ధుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, వేసవి దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా అధికారులు కూడా ప్రతి గ్రామపంచాయతీకి హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో సమీక్ష సమావేశంలో మండల పరిషత్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి..

జిల్లాలో విద్యా మరియు శిశు సంక్షేమ సేవల అమలును పరిశీలించే భాగంగా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడి వసతులు, సేవల నాణ్యతపై సమగ్రంగా పరిశీలించారు. మొదట ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ తరగతి గదుల పరిస్థితి, పరిశుభ్రత, మరుగుదొడ్లు, త్రాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పాఠశాల పరిసరాలు, కాంపౌండ్ వాల్ వంటి మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం బాగుందని విద్యార్థులు తెలపడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. తదుపరి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ కేంద్రంలోని వంటగది, పరిశుభ్రత, పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, త్రాగునీరు, చల్లని వాతావరణం కల్పించాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్, ఇండ్ల ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పిమ్మట మోనిన్ పరిశ్రమను సందర్శించి, అక్కడ అమలవుతున్న భద్రతా చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో వేణుగోపాల్, సర్పంచ్ అనంతరెడ్డి, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిమానవుల రాతి చిత్రాలు వెలుగులోకి

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**





మెదక్ జిల్లా మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామంలో నిజాం డెక్కన్ షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని రాళ్ల గుట్టపై ఆదిమానవుల రాతి చిత్రాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 15 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పుతో ఉన్న రాతిచిత్రాల కాన్వాస్‌ను కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధక సభ్యుడు బుర్ర సంతోష్ గుర్తించారు. ఈ రాతిచిత్రాల్లో రెండు తాబేళ్లు, జిగ్‌జాగ్ రేఖలు, ఆరు పాత్రలు, గొలుసుకన్నెలు ఒక వరుసలో, వెనుక వేలాడే బుట్ట, చెట్లవలె కనిపించే పొడవైన నిలువు గీతలు, నిలువుగా-అడ్డంగా గీసిన గీతలు, నాలుగు బాణాల ఆకృతులు ఒక దిశలో, ద్వంద్వ వృత్తానికి నలువైపుల గురిచేసిన బాణాలు, ఒక వృత్తంలో ఐదు బాణాలు వంటి డిజైన్లు కనిపిస్తున్నాయి. అలాగే దీర్ఘవృత్తాలు, వృత్తాలు, త్రిశూలం ఆకృతులు, తేనెపట్టు నమూనాలు, సన్నని 8-9 గీతలతో కంఠహారంలా కనిపించే అర్ధవృత్తాలు, ఇంకా గుర్తించలేని పలు డిజైన్లు కూడా ఉన్నాయని తెలిపారు. రాతిచిత్రాలన్నీ ఎరుపు రంగులో గీసినవని, రంగు గాఢత, గీతల శైలిని ఆధారంగా తీసుకుంటే కొన్ని పెదరాతియుగానికి, ఎక్కువ భాగం చారిత్రక యుగానికి చెందినవిగా భావించవచ్చని రాతిచిత్రాల నిపుణులు డా. బండి మురళీధర్ రెడ్డి, రామోజు హరగోపాల్ పేర్కొన్నారు. క్షేత్ర పరిశోధనను బుర్ర సంతోష్ నిర్వహించగా, విషయ వివరణను కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ అందించారు.



## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

అందోల్ నియోజకవర్గ పరిధిలోని టేక్మాల్ మండలం ఎల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పొగుల వెంకటపురంలో సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు రూ.5 లక్షల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిమ్మ రమేష్, సర్పంచ్ ఉప్పరి మమత నవీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, ఉప సర్పంచ్ కిషన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కిష్టయ్య, నరేందర్, శ్రీను, వెంకయ్య, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలి

- సిద్దిపేట సీపీ రష్మి పెరుమాల్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**




ములుగు మండలం వంటిమామిడి లోని ఆర్.వి.ఎం మెడికల్ కళాశాలలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రాణాపాయానికి దారితీస్తుందని, అజాగ్రత్తగా వాహనాలు నడిపి అమూల్యమైన ప్రాణాలను కోల్పోవద్దని కోరారు. యువత మత్తు పదార్థాలు, ఇతర వ్యసనాలకు బానిసలు కాకూడదని హెచ్చరించారు. ఒక్కసారి తప్పుడు మార్గంలో వెళ్తే అది కెరీర్‌ను, జీవితాన్ని సర్వనాశనం చేస్తుందని పేర్కొన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులు ఒకరికొకరు స్నేహభావంతో మెలగాలని సూచించారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకోవడం పరిష్కారం కాదని హితవు పలికారు. ఏదైనా సమస్య ఎదురైతే విద్యార్థులు తమ సీనియర్లు లేదా అధ్యాపకులను సంప్రదించాలని సూచించారు. సమస్యలను చర్చించి పరిష్కరించుకోవాలే తప్ప ఆత్మహత్య వంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రిలోని సీసీటీవీ మానిటరింగ్ వ్యవస్థను స్వయంగా తనిఖీ చేశారు. భద్రతా దృష్ట్యా నిరంతరం నిఘా కొనసాగించాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు తక్షణమే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, స్థానిక ములుగు ఎస్ఐ రఘుపతి, ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## శివపార్వతుల కళ్యాణోత్సవం

- పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

జోగిపేటలో జరుగుతున్న జోగినాథ స్వామి రథోత్సవ ఉత్సవాల సందర్భంగా మంగళవారం నిర్వహించిన శివపార్వతుల కళ్యాణోత్సవానికి రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాండు, అందోల్ తహసీల్దార్ మధుకర్ రెడ్డి, జోగిపేట సీఐ అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేరి జగన్మోహన్ రెడ్డి, జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, కౌన్సిలర్లు కొాషికే రాజశేఖర్, తోట్ల రామకృష్ణ, ప్రదీప్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల ప్రవీణ్ కుమార్, శరత్ బాబు, రంగా సురేష్, మాజీ ఎంపీపీ రామా గౌడ్, చాపల వెంకటేశం, 13వ వార్డు కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు డాకూరి వెంకటేశం, మాజీ కౌన్సిలర్ డాకూరి శివశంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, గుర్రం కృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యులు అల్లే శ్రీకాంత్, చిట్యాల మధు, ఉలువల రాజు, కుమ్మరి భాస్కర్, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## 2న పాపన్న గౌడ్ వర్ధంతి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

బహుజన చక్రవర్తి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 316వ వర్ధంతి ఏప్రిల్ 2 గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె బాలకిషన్ గౌడ్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలోని పాపన్న గౌడ్ చౌరస్తాలో ఉన్న పాపన్న గౌడ్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి గౌడ కుటుంబ సభ్యులతో పాటు బహుజనవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లె అనిల్ గౌడ్, ముంద్రాతి రాజు గౌడ్, రామంచ మల్లేశం గౌడ్, బోల్గం అంజయ్య గౌడ్, గడ్డమిది యాదగిరి గౌడ్, గుర్రం బాల్‌రాజు గౌడ్, అంబటి ప్రకాష్ గౌడ్, గాదగోని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ రోజే ఎస్పీగా పదోన్నతి



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్.మహేందర్ కు ఎస్పీగా పదోన్నతి లభించింది. ఆయనను సీఐడీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఎస్పీగా పదోన్నతి పొందిన మహేందర్ మంగళవారం సాయంత్రం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మహేందర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగ విరమణ రోజు పదోన్నతి పొందడం ఆనందంగా ఉందన్నారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో గడవాలని ఆకాంక్షించారు.

## ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తానని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర హామి ఇచ్చారు. మంగళవారం జోగిపేటలో జరుగుతున్న జోగినాథస్వామి రథోత్సవాలలో భాగంగా శివపార్వతుల కళ్యాణోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు ఆయనను కలువగా సానుకూలంగా స్పందించారు. తన కార్యాలయానికి రమ్మని వారితో చెప్పారు. కూర్చోని మాట్లాడుకుందామని ఆయన వారితో చెప్పారు. సమస్య ఏదైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామి ఇచ్చారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పబ్లిక్ వైఫైలో సెన్సిటివ్ లాగిన్లు చేయవద్దు**

ఓపెన్ నెట్‌వర్క్స్‌లో హ్యాకింగ్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.



# అప్పుల తెలంగాణ

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన కాంగ్రెస్
- కాగ్ నివేదిక తో ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం బట్టబయలు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని ఆమె ఆరోపించారు. రోజువారీ ఖర్చుల కోసం కూడా ఆర్బీఐ వద్ద నుంచి అప్పులు తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. కాగ్ 202425 నివేదికలో బయటపడిన వివరాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత దిగజారిందో చూపిస్తున్నాయని పేర్కొన్నారు. ఏడాది కాలంలో భారీగా అప్పులు తీసుకుని ప్రభుత్వం నడపడం చేతకానితనానికి నిదర్శనమని ఆమె అన్నారు. ఇప్పటికే రాష్ట్రంపై లక్షల కోట్ల అప్పు భారంతో ప్రతి కుటుంబంపై భారీ భారం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా "మిగులు బడ్జెట్" అని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక క్రమశిక్షణ పాటించి పరిస్థితిని సరిదిద్దాలని ఆమె డిమాండ్ చేశారు. ఇక అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతుల పరిస్థితిపై కూడా కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. కోత దశలో ఉన్న పంటలు నాశనమవడంతో రైతులు తీవ్ర నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి రైతుకు తగిన పరిహారం అందించాలని ఆమె కోరారు.

# ట్రంప్‌కు షాక్ ఇస్తున్న యూరప్ దేశాలు

**ముద్ర డెస్క్ :**

ఇరాన్‌పై యుద్ధం కొనసాగిస్తున్న అమెరికాకు యూరప్ దేశాలు వరుసగా షాక్ ఇస్తున్నాయి. యుద్ధంలో పాల్గొనే అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేయడానికి ఇటలీ చర్యలు తీసుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. సిసిలీలోని తమ కీలక వైమానిక స్థావరాన్ని అమెరికా విమానాలు ఉపయోగించుకోవడానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు ఇటలీ ప్రకటించింది. పశ్చిమాసియాకు వెళ్లే ముందు సిసిలీలోని వైమానిక స్థావరంలో యూఎస్ బాంబర్ విమానాలను నిలపడానికి అమెరికా ఇటలీ అనుమతి కోరినట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఈ కథనాలు వెలువడడం గమనార్హం. ఇటీవల స్పెయిన్ సైతం ఇదే తరహా ప్రకటన చేసింది. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో పాల్గొనే విమానాలను తమ గగనతలంలో అనుమతించబోమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ ప్రకటించారు. ఇరాన్‌పై దాడుల్లో జోక్యం చేసుకోవడానికి ఈయూ దేశాలు ఆసక్తి చూపడం లేదని స్పష్టమవుతోంది.



# మాజీ సీఎం జయలలిత ఇల్లు సీజ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత జయలలితకు చెందిన హైదరాబాద్ నివాసాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో ఉన్న జయలలిత విల్లాకు సుమారు రూ.1.60 కోట్ల ఇంటి పన్ను బకాయిలు ఉండటంతో ఈ చర్యలు తీసుకున్నారు. గత కొంతకాలంగా ఇంటి పన్ను బకాయిలు పెండింగ్‌లో ఉండటం, పలు మార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోవడంతో అధికారులు ఆ నివాసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ భవనాన్ని గతంలో ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్య లీజుకు తీసుకున్నట్లు సమాచారం. ఆ సమయంలో నుంచి ఇప్పటివరకు పన్నులు పూర్తిగా చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. తమిళనాడు రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన జయలలిత ముఖ్యమంత్రిగా దశాబ్దాల పాటు ప్రజలకు సేవలందించారు. తమిళనాడు ప్రజలు ఆమెను 'అమ్మ' అని ఆప్యాయంగా పిలుస్తారు. నేటికీ తమిళనాడులో జయలలిత క్రేజ్ తగ్గలేదు. ఆమె భౌతికంగా లేనప్పటికీ , ఆమె అభిమానులు, నాయకులు పెద్దసంఖ్యలో ఉన్నారు. తమినాడు రాజకీయాలను ప్రభావితం చేయగలిగేలా అమ్మ ఫాలోవర్స్ ఉన్నారంటే పరిస్దితి అర్దం చేసుకోవచ్చు.

# ఆటో ఎల్‌పీజీ కొరతపై కేంద్రానికి ఉత్తమ్ లేఖ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో ఆటో ఎల్‌పీజీ కొరత తీవ్రరూపం దాల్చింది. ఈ సమస్యపై రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర పెట్రోలియం మంత్రి హరిదీప్ సింగ్ పూరికి లేఖ రాసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్‌లో ఆటోరిక్షాలు గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని, దీనివల్ల ప్రజా రవాణా వ్యవస్థపై ప్రభావం పడుతోందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో సుమారు లక్ష ఎల్‌పీజీ ఆటోలు నడుస్తున్నప్పటికీ, ప్రభుత్వ సంస్థల వాటా కేవలం 20 శాతం మాత్రమే ఉందని, మిగతా 80 శాతం ప్రైవేట్ కంపెనీల ఆధీనంలో ఉందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ కొరత ఏర్పడటంతో అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు డ్రై అవుట్ అవుతున్నాయని వెల్లడించారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటులో ఉంచాలని, ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రాన్ని మంత్రి విజ్ఞప్తి చేశారు. అలాగే గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా నిరంతరంగా కొనసాగించాలని, కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ప్రస్తుతం ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75 ఉండగా, ప్రైవేట్ ఔట్‌లెట్లలో రూ.93 వరకు ధరలు పెరగడం ప్రజలకు భారంగా మారిందని పేర్కొన్నారు. ధరల నియంత్రణతో పాటు తక్షణ జోక్యం ద్వారా పరిస్థితిని సర్దుబాటు చేయాలని కేంద్రాన్ని కోరారు.

# తెలంగాణపై క్యాన్సర్ పంజా

- 2026 చివరి నాటికి కొత్తగా 46,762 కేసుల అంచనా
- మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ముప్పు అధికం
- పొగాకు వాడకంతో పురుషుల్లో 58.8 శాతం కేసులు
- నిర్ధారణ జాప్యంతో ప్రమాదకర పరిస్థితులు
- ఐసీఎంఆర్ నివేదికలో కీలక అంశాలు వెల్లడి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణపై క్యాన్సర్ పంజా విసురుతోంది. మునుపెన్నడూ లేని విధంగా కేసులు భారీగా నమోదవుతున్నాయి. సకాలంలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలో జరుగుతున్న జాప్యంతో ప్రాణాలకు ముప్పు పెరుగుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో 2026 చివరి నాటికి కొత్తగా 46,762 కేసులు నమోదయ్యే అవకాశం ఉందని ఐసీఎంఆర్ నివేదిక వెల్లడించింది. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉన్నప్పటికీ స్క్రీనింగ్ రేటు 4 శాతం కంటే తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పొగాకు వాడకంతో పురుషుల్లో 58.8 శాతం కేసులు నమోదవుతున్నాయని నివేదిక తెలిపింది. వ్యాధిని ముందస్తుగా గుర్తించకపోవడంతో చికిత్స ఫలితాలు ఆశాజనకంగా లేకపోతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకోకపోవడంతో చాలా మంది రోగులు వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రులకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉన్నప్పటికీ ఆలస్యం కావడంతో చికిత్స క్లిష్టతరంగా మారుతోంది. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా స్క్రీనింగ్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, పొగాకు నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**-ఏటా వేలల్లో కేసులు..**

క్యాన్సర్ బాధితుల సంఖ్య ప్రతి ఏడాది వేలల్లో పెరుగుతున్నప్పటికీ ముందస్తు పరీక్షల పట్ల ప్రజల్లో అవగాహన లోపించడం ఆందోళనకరంగా మారింది. దీనిపై 'తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్2026' పేరుతో ఐసీఎంఆర్ విడుదల చేసిన తాజా నివేదిక దిగ్భ్రాంతికర నిజాలను వెలుగులోకి తీసుకువచ్చింది. తెలంగాణలో క్యాన్సర్ కేసులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయని హెచ్చరించింది. ప్రతి ఏడాది వేల సంఖ్యలో కొత్త కేసులు నమోదవుతున్నప్పటికీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించే స్క్రీనింగ్ పరీక్షల రేటు అత్యల్పంగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. నివేదిక ప్రకారం రాష్ట్రంలో 30 నుంచి 49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళల్లో కనీసం 4 శాతం మంది కూడా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం లేదు. ఇది వేలాది మంది ప్రాణాలను ముప్పులోకి నెడుతోంది. మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ రేటు కేవలం 0.3 శాతంగా ఉంది. అలాగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు 3.3 శాతం, నోటి క్యాన్సర్ పరీక్షలు 2.5 శాతం మహిళలు మాత్రమే చేయించుకుంటున్నారు. పురుషుల్లో కేవలం 2.6 శాతం మంది మాత్రమే నోటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. నిమ్స్‌తో పాటు మరో 10 ఆస్పత్రుల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. 2026 చివరి నాటికి రాష్ట్రంలో కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు నమోదవుతాయని అంచనా. ఇందులో పురుషులు 21,252 మంది కాగా, మహిళలు 25,510 మంది ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య ఏడాదికి 47,314కు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

**దశాబ్దంలో 30 శాతం వృద్ధి..**

దశాబ్ద కాలంలో క్యాన్సర్ కేసుల సంఖ్య 30 శాతం పెరిగింది. 2015లో 40,177గా ఉన్న కేసులు 2024 నాటికి 52,334కు చేరడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. మహిళల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 183.8 మంది క్యాన్సర్ బారిన పడుతుండగా, పురుషుల్లో ఈ రేటు 141.9గా ఉంది. రాష్ట్రంలో నమోదవుతున్న క్యాన్సర్లలో పొగాకు వాడకం వల్ల వచ్చే కేసులే అధికంగా ఉన్నాయి. పురుషుల్లో 58.8 శాతం, మహిళల్లో 29.7 శాతం క్యాన్సర్లు పొగాకు కారణంగా వస్తున్నాయి. ముఖ్యంగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. దీనికి తోడు ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు కూడా క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయి. మహిళల్లో పీసీఓడీ, హార్మోన్ల సమస్యలు కూడా క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి.

# ప్రజాస్వామ్య పద్ధతిలో మూసీ పునర్జీవనం

- 15 రోజులపాటు ప్రజల అభిప్రాయాలు ఆన్‌లైన్‌లో నమోదు
- విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ
- అధికారులకు 24/7 సబ్ కమిటీ సభ్యులు అందుబాటులో
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసి పునర్జీవనం పనులు ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతాయని డిప్యూటీ సీఎం, మూసి క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క తెలిపారు. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు మూసి పునర్జీవనంపై ఆన్‌లైన్‌లో musrirdc@gmail.com మెయిల్ ఐడీ ద్వారా ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అధికారులతో కలిసి విశ్లేషిస్తామని, అనంతరం అభిప్రాయాలు తెలిపిన వారితో సబ్ కమిటీ సభ్యులు దశలవారీగా సంప్రదింపులు జరుపుతారని చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి, మూసి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యుడు పొన్నం ప్రభాకర్‌తో కలిసి మూసి పునర్జీవనం పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసి నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు గత నెల 28న శంకుస్థాపన జరిగినట్లు తెలిపారు. ఆ రోజు నుంచి మూసి ఫేజ్ 1, ఫేజ్ 2 పనులకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసి పునరావాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లను తుది దశకు తీసుకు రావడం, బ్యాంకర్లతో చర్చలు జరపడం వంటి పనులను విభజించుకొని ముందుకు సాగాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ ప్రాజెక్టు అధికారుల జీవితాల్లో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. అధికారులకు అవసరమైన సలహాలు, సూచనలు లేదా ఇతర సహాయం కోసం మూసి సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ రంజన్, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఇవి. నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మన చౌదరి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ పాల్గొన్నారు.





# తెలంగాణలో బాబు పాలన

- రాష్ట్ర పాలనను సీఎం.. ఆంధ్రా పాలకులకు అప్పజెప్పారు
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఏ పాలకుల మీదైతే పోరాడి తెలంగాణ సాధించుకున్నామో మళ్లీ ఆ పాలకులే ఇక్కడ రాజ్యమేలుతున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి నామమాత్రంగా సీఎం కుర్చీలో కూర్చుకున్నారని.. పరిపాలన మొత్తం ఆంధ్రా పాలకులకే అప్పజెప్పారని అన్నారు. తెలంగాణను పాలిస్తోందని రేవంత్ రెడ్డి కాదన్న ఆయన చంద్రబాబు డైరెక్షన్ లో పాలన జరుగుతోందని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడకూడదనే అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ప్రవేశ పెట్టారని విమర్శించారు.

# 11 బిల్లుల్లో పదింటికి ఆమోదం

- అసెంబ్లీలో కీలక అంశాలు చర్చకు రాకుండా బీఆర్ఎస్ కుట్ర
- ప్రతిపక్షాలకు సమయం ఇవ్వలేదని హంగామా
- అన్ని వర్గాల సంక్షేమ బాధ్యతను భుజాన వేసుకున్న ప్రభుత్వం
- తల్లిదండ్రులు, ఉద్యోగులు, ప్రజల సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు
- మూసీ డీపీఆర్ చర్చకు రాకుండా డ్రామా
- కేంద్ర మంత్రి ప్రకటనతో కాళేశ్వరం అవినీతి బహిర్గతం
- మీడియాతో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉద్యోగులు, ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత నెల 31న అసెంబ్లీలో ప్రభుత్వం 11 బిల్లులను ప్రవేశపెట్టగా, అందులో 10 బిల్లులు ఆమోదం పొందాయని వెల్లడించారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బిల్లులను తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో ప్రేమాభిమానాలు పెంపొందించే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని యెన్నం తెలిపారు. మత సామరస్యాన్ని కాపాడుతూ, విద్వేషపూరిత నేరాలను అరికట్టే బిల్లు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో న్యాయవాదులు అన్యాయానికి గురయ్యారని, వారిపై దాడులు జరిగినప్పటికీ సరైన రక్షణ కల్పించలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో లక్షలాది న్యాయవాదులకు రక్షణ కల్పించే చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం రూ.15 లక్షల ఆరోగ్య భీమా పథకాన్ని రూపొందించిందని, 75 ఏళ్లు దాటి రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించిన డీపీఆర్ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అయితే ఆ డీపీఆర్ అంశం చర్చకు ముందుకు రాకుండా బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. గతంలో వివక్షకు గురైన శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క వంటి నాయకులు ఇప్పుడు సభను సమర్థంగా నడిపిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలకు సమయం ఇవ్వలేదని విమర్శించిన బీఆర్ఎస్, అసెంబ్లీలో చర్చలకు ముందుకు రాలేదని ఆరోపించారు. మెట్రో రైలు నిధుల అంశంపై కూడా బీఆర్ఎస్ హాజరు కాలేదని విమర్శించారు. అసెంబ్లీలో బడ్జెట్ పత్రాలను చింపి సభ గౌరవాన్ని దిగజార్చే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభను అడ్డుకున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరితే ప్రభుత్వం మంచి పేరు పొందుతుందని భావించి బీఆర్ఎస్ భయంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. గల్ఫ్ కార్మికుల సమస్యలపై కూడా బీఆర్ఎస్ స్పందించడం లేదన్నారు. గడ్డి మందు నిషేధంపై చర్చకు ఎందుకు దూరంగా ఉంటోందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రైతుల తీర్మానం నుంచి దూరంగా ఉన్న బీఆర్ఎస్ రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఎద్దేవా చేశారు. నోటీసుల పేరుతో సభను అడ్డుకోవడం బీఆర్ఎస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అవినీతి అంశంపై కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలతో నిజాలు బయటపడుతున్నాయని తెలిపారు. ఆ అంశంలో కుంభకోణం వెలుగులోకి వస్తుందనే భయంతో బీఆర్ఎస్ చర్చకు దూరంగా ఉంటోందని ఆరోపించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



అకౌంట్ యాక్టివిటీని చెక్ చేస్తూ ఉండండి
అనుమానాస్పద లాగిన్లు ఉంటే వెంటనే యాక్షన్ తీసుకోండి.




# అమరావతి క్వాంటం వ్యాలీకి శ్రీకారం

**ముద్ర, అమరావతి :**



అమరావతిలో క్వాంటం టెక్నాలజీకి కొత్త దిశ చూపే విధంగా "క్వాంటం వ్యాలీ" ప్రాజెక్ట్ వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్ట్‌ను భవిష్యత్తు ఆర్థిక అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా అభివర్ణించారు. జాతీయ స్థాయిలో అమలు అవుతున్న జాతీయ క్వాంటం మిషన్ అవకాశాలను ముందుగానే అందిపుచ్చుకున్న ఆంధ్రప్రదేశ్, అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో ఐటీ రంగంలో సాధించిన విజయాన్ని మాదిరిగానే, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్‌లో కూడా "ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్" పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ లాంటి ప్రముఖ సంస్థల సహకారంతో రాష్ట్రంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా క్వాంటం హార్డ్‌వేర్‌ను దేశీయంగా తయారు చేయడం, అవసరమైన క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ అభివృద్ధి చేయడం వంటి లక్ష్యాలు కూడా పెట్టుకున్నారు. అమరావతిలో 8 ప్రత్యేక టవర్లు నిర్మించి, క్వాంటం టెక్నాలజీ పరిశోధన, అభివృద్ధికి ప్రోత్సాహం ఇవ్వనున్నారు. గ్రీన్ ఎనర్జీ వినియోగం, మైక్రోగ్రిడ్స్, డేటా సెంటర్ల అభివృద్ధి వంటి అంశాలు కూడా ఈ ప్రాజెక్ట్‌లో కీలకంగా ఉంటాయి. మొత్తంగా క్వాంటం వ్యాలీ ద్వారా అమరావతి భవిష్యత్ నగరంగా, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే టెక్నాలజీ కేంద్రంగా అవతరించనుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

# స్వర్ణరథంపై శ్రీ భూ సమేత శ్రీ మలయప్పస్వామి కటాక్షం

**ముద్ర, తిరుమల:**



శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం 8 నుంచి 10 గంటల నడుమ అత్యంత వైభవంగా సాగిన స్వర్ణరథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని గోవిందనామాలు జపిస్తూ రథాన్ని లాగారు. స్వర్ణరథోత్సవాన్ని దర్శించడంవల్ల లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూ, భూదేవి కరుణతో, సమస్తధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని భక్తుల విశ్వాసం.

# పెట్రోల్‌బంక్‌ను ప్రారంభించిన డీజీపీ

**ముద్ర, మల్కాజిగిరి:**

తెలంగాణ పోలీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేగంపేటలో ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంక్‌ను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) శివధర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ శ్రీ అవినాష్ మహంతి, ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ ఐజీపీ గజరావు భూపాల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఈ పెట్రోల్ బంక్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీస్ సిబ్బంది సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించే లక్ష్యంతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఈ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 1, 2026 నుండి ఈ పెట్రోల్ బంక్ సాధారణ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

# ఇద్దరు కుమారులతో పాటు తల్లి ఆత్మహత్య

**కైతలాపూర్‌లో విషాదం**

**ముద్ర కూకట్‌పల్లి :**



కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కైతలాపూర్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు ఒక నిండు ప్రాణాన్ని, ఇద్దరు చిన్నారుల భవిష్యత్తును బలితీసుకున్నాయి. మనస్పర్థల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన ఒక తల్లి, తన ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానిక సమాచారం ప్రకారం కైతలాపూర్ రాఘవేంద్ర సొసైటీ ప్రాంతానికి చెందిన బానోత్ శ్రావంతి (27) భర్త ప్రవీణ్ తన ఇద్దరు కుమారులూ కార్తీక్ (10) , కౌశిక్ (8) కలిసి నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో వివాదాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం ఈ గొడవలు ముదరడంతో తీవ్ర ఒత్తిడికి లోనైన ఆమె ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకుంది. మొదట తన ఇద్దరు కుమారులకు ఆపై తాను కూడా ఉరివేసుకుని ప్రాణాలు వదిలినట్లు సమాచారం. ఇంటి నుంచి ఎలాంటి శబ్దం రాకపోవడంతో అనుమానం వచ్చిన పొరుగువారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కూకట్‌పల్లి పోలీసులు తలుపులు బద్దలుకొట్టి చూడగా ముగ్గురు విగతజీవులుగా పడి ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వేధింపులే ఈ ఆత్మహత్యకు ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

# ఆస్పత్రి ఫ్లష్ ట్యాంక్‌లో నవజాత శిశువు మృతదేహం

**ముద్ర, కూకట్‌పల్లి:**

కూకట్‌పల్లిలోని రాందేవరావు ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఓపీడీ మహిళా వాష్‌రూమ్ ఫ్లష్ ట్యాంక్‌లో ఒక నవజాత మగ శిశువు మృతదేహం లభ్యమైంది. ఆస్పత్రిలో పనిచేసే నరసమ్మ అనే ఆయా వాష్‌రూమ్‌ను శుభ్రం చేయడానికి వెళ్లిన సమయంలో ఫ్లష్ ట్యాంక్‌లో శిశువు మృతదేహాన్ని గమనించి ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గుర్తు తెలియని మహిళ ఆస్పత్రి వాష్‌రూమ్‌లోనే ప్రసవించి, శిశువును అక్కడ వదిలేసి వెళ్ళిందా లేదా మృతదేహాన్ని బయట నుంచి తెచ్చి ఇక్కడ పడవేసారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. నిందితులను గుర్తించేందుకు ఆస్పత్రిలోని సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నాం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చెసిన పోలీసు అధికారులు ప్రస్తుతం పోలీసులు ఆస్పత్రి రికార్డులను గడిచిన 24 గంటల్లో ఓపీకి వచ్చిన గర్భిణుల వివరాలను సేకరిస్తున్నారు. శిశువు మృతికి గల కారణాలు పోస్టుమార్టం రిపోర్ట్ తర్వాతే తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

# తూతూ మంత్రంగా అసెంబ్లీ

- **దిశా నిర్దేశం లేకుండానే ముగించారు**
- **ప్రతిపక్షం లేకుండానే కీలక బిల్లులకు ఆమోదం**
- **ఆరు గ్యారెంటీలపై స్పష్టత, ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం లేదు**
- **బడ్జెట్, బిల్లులు పాస్ చేసుకోవడానికే సభ నడిపించారు**
- **19 సమస్యలపై షార్ట్ డిస్కషన్ కోసం బీఆర్‌ఎస్ నోటీసులపై స్పందించలేదు**
- **హౌస్ కమిటీ పనికిరాదని చెప్పి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గౌరవాన్ని తగ్గించారు**
- **సీఎం రాక కోసం అసెంబ్లీకి నాలుగు గంటలు ఆపారు**
- **మీడియాతో బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**



ముద్ర, తెలంగాణ బ్యూరో :
శాసనసభ సమావేశాలు ఒక దిశా నిర్దేశం లేకుండా ముగిశాయని బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. ఆరు గ్యారెంటీలపై స్పష్టత వస్తుందని, ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించిన రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం తీవ్ర నిరాశనే మిగిల్చిందన్నారు. బడ్జెట్, బిల్లులు పాస్ చేసుకోవడానికి, రాజ్యాంగ అనివార్యతను పూర్తి చేయడానికి మాత్రమే తూతూ మంత్రంగా సభను నడిపారని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న 19 సమస్యలపై షార్ట్ డిస్కషన్ కోసం బీఆర్‌ఎస్ పక్షాన నోటీసులు ఇచ్చినా, ఏ ఒక్క అంశం పైనా ప్రభుత్వం చర్చకు రాలేదని దుయ్యబట్టారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు చెప్పుకోవడానికి ఒక్క ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం కూడా లేని దయనీయ స్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. సభా సాంప్రదాయాలను పూర్తిగా తిలోదకాలిచ్చిన అధికార పార్టీ సభ్యులు, నియమ నిబంధనలు, సభా మర్యాదలను, ప్రతిపక్షాల పట్ల కనీస గౌరవాన్ని తుంగలో తొక్కారని మండిపడ్డారు. ప్రతిపక్షాల విషయంలో రేవంత్ రెడ్డి ప్రవర్తించిన తీరు సభానాయకుడి హోదాకు తగింది కాదన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నించేందుకు ప్రతిపక్షం ఉంటుందన్న ఆయన ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నించడమే ప్రతిపక్ష బాధ్యత అని అన్నారు. ఆ బాధ్యతను బీఆర్‌ఎస్ నిర్వహిస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతోందన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజైనా, అప్రాప్రియేషన్ రోజైనా ప్రశ్నోత్తరాల సమయం ఉంటుందన్నారు. కానీ ఈ ప్రభుత్వం ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా ఎత్తివేసిందన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం రోజు, ఆర్థిక మంత్రి బడ్జెట్ పెట్టిన రోజు ప్రశ్నోత్తరాలు లేవన్నారు. సభ జరిగిన రోజుల్లో సగం రోజులు ప్రశ్నోత్తరాలు నడపలేదనీ ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలు చర్చకు రాకుండా చేశారని ఆరోపించారు. సమయపాలన లేదు, సభ అంటే గౌరవం లేదు. శాసనసభను గాంధీభవన్‌లాగా మార్చేశారని ఫైర్ అయ్యారు. సీఎం ఢిల్లీ నుంచి వస్తున్నాడని ఏకంగా 4 గంటలు టీ బ్రేక్ ఇచ్చిన ప్రభుత్వం ఫైనాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని 3 గంటలపాటు సభను ఆపివేశారన్నారు. అసెంబ్లీ పని దినాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయని, వారం రోజులు సభను పెంచాలని కోరినా ప్రభుత్వం ముందుకు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేరళ ఎన్నికల ప్రచారం కోసం అసెంబ్లీని 30న హడావుడిగా ముగించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు, ప్రజా సమస్యలు ముఖ్యమా? లేక కేరళ ఎన్నికల ప్రచారం ముఖ్యమా? అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని సాక్ష్యాధారాలతో సహా సభలో బయటపెడితే, ప్రజల దృష్టి మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడ్డారనీ అన్నారు. అవినీతి నుంచి మంత్రిని కాపాడటానికే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజుల పాటు సస్పెండ్ చేసి, ప్రతిపక్షం లేకుండానే ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకున్నారని విమర్శించారు. హేట్ స్పీచ్ బిల్లును చివరి రోజు తెచ్చి ఎలాంటి చర్చ లేకుండానే ముగించారన్నారు. ఇరిగేషన్ పద్దు మీద కూడా కనీస చర్చ లేకుండా పాస్ చేసుకున్నారన్నారు. హౌస్ కమిటీ పనికిరాదని చెప్పి, శాసన సభ్యులకు, శాసనసభకు గౌరవాన్ని తగ్గించారని ఆరోపించారు. చిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు సహా అన్ని వర్గాల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ సభలో ప్రభుత్వాన్ని నిలదీసిందన్నారు.

**కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై ఖండన**

పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను పార్టీ తరపున ఖండించారు. ఆయన వ్యాఖ్యలు అచ్చం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉన్నాయని ఆరోపించారు. పాటిల్ వ్యాఖ్యలతో బీఆర్‌ఎస్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్, బీజేపీల ఫెవికాల్ బంధం బయటపడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. 90 వేల కోట్లు, రూ. లక్ష కోట్లు కొట్టుకుపోయాయని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి ఎలా మాట్లాడుతారని నిలదీశారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే ఆదర్శం అని కేంద్ర మంత్రులు, అధికారులు కితాబిచ్చారన్నారు. ఇది తెలంగాణకు వరప్రదాయిని అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణకు ఇది ముక్తేశ్వర ప్రాజెక్టు అని ఆనాటి గవర్నర్ నరసింహన్ కొనియాడిన విషయాలను హరీశ్ రావు గుర్తు చేశారు. కాళేశ్వరం వృధా ప్రాజెక్టు అయితే ఆ ప్రాజెక్టుతో లబ్ధిపొందుతోన్న జిల్లాల్లో పర్యటనకు తమతో కలిసి రావాలని హరీశ్ రావు సవాల్ చేశారు.

# ఆదాయం, ఆస్థులపై ఆశలేదు..

- **వికారాబాద్ అభివృద్ధి లక్ష్యం**
- **తాను అందరు రాజకీయ నాయకుల్లా కాదు..**
- **శాశనసభ -స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**




తాను అందరు రాజకీయ నాయకుల్లా కాదని, తనకు ఆదాయం, ఆస్థులపై ఆశ లేదని రాష్ట్ర శాశనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌స్పష్టం చేశారు. వికారాబాద్ ప్రాంతం అభివృద్ధి నా లక్ష్యం, మర్రి చెన్నారెడ్డి లాగా ఈ ప్రాంతం అభివృద్ధిపై తన ముద్ర ఉండాలని తన కోరిక అన్నారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య ఆధ్వర్యంలో నిర్వహించిన మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశంలో ఎక్స్ అఫిషియో హోదాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మున్సిపాలిటీ లో విలీనమైన గ్రామాలలో అవసరమైన ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయిస్తానని తెలిపారు. పట్టణం పరిధిలో అవసరమైన మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిలను మంజూరు చేయించడానికి రైల్వే శాఖతో ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్న జంక్షన్లను అభివృద్ధి చేయిస్తానని, మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ మర్రి చెన్నారెడ్డి నిర్మించిన శివసాగర్ చెరువును పూర్తిగా ఆధునికీకరిస్తానని హామీ ఇచ్చారు. హైదరాబాద్ ఎన్టీఆర్ పార్కు తరహాలో ఇక్కడ కూడా పార్కును ఏర్పాటు చేయిస్తాను. వైఎస్ రాజశేఖరరెడ్డి మన వికారాబాద్ ప్రాంతానికి సాగునీరు తీసుకురావడానికి ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి పథకాలను తీసుకురావాలని ప్రయత్నం చేశాను. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసి మన ప్రాంతానికి అన్యాయం చేసిందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మన ప్రాంతానికి తీసుకురావాలని మళ్ళీ ప్రయత్నాలు చేస్తున్నానని, ఈసారి ఖచ్చితంగా విజయం సాధిస్తామని అన్నారు. ఈ పథకం పూర్తయితే మన వికారాబాద్ పట్టణానికి తాగునీటితో పాటుగా సాగునీటి ఇబ్బందులు తొలగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. టీయుఎఫ్ ఐడీసీ రూ.60 కోట్ల నిధులు మంజూరయ్యాయని, హెచ్ ఎండీఏ నిధులు రూ.270 కోట్లు త్వరలోనే మంజూరు అవుతాయని తెలిపారు. అనంతగిరిని రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా సంస్థతో ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మూడు వేల మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా ఉన్నప్పుడు పట్టణ పరిధిలోని నారాయణపూర్ లో వంద ఎకరాలలో టెక్స్ టైల్స్ పార్కు అభివృద్ధి చేసి నాలుగు వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలని ప్రయత్నం చేశానని, గత ప్రభుత్వం పట్టించుకోలేదని, మళ్ళీ ఇప్పుడు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు, మిగిలిన సమయంలో అందరూ మనవాళ్ళే, అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అందరినీ కలుపుకుని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి కట్టుగా పనిచేసి నిధులను సక్రమంగా, సమర్థవంతంగా ఖర్చు చేసి వికారాబాద్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. తన వంతుగా పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. చైర్ పర్సన్ గడ్డం అనన్య మాట్లాడుతూ వార్డుల సభ్యులు చెప్పిన సమస్యలను అన్నింటినీ తాను వ్యక్తిగతంగా నోట్ చేసుకున్నానని, ప్రతి వార్డులో పర్యటించి కామన్ ప్రాబ్లమ్స్ ను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేద్దామన్నారు. వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) ఉమా శంకర్, కమీషనర్ విక్రం సింహారెడ్డి, వార్డుల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

**కోట్ పల్లి వాగుపై హై లెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన**

ధారూర్ మండలం కోట్ పల్లి వాగుపై 27 కోట్ల యాబై లక్షలతో నూతనంగా నిర్మించే హైలెవల్ బ్రిడ్జికి మంగళవారం రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కష్టాలు తొలగించడానికి హై లెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు రూ.27.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి ధన్యావాదాలు తెలిపారు. కలెక్టర్ దీపక్ తివారీ, అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్ అండ్ బి సీఇ వసంత నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ధారూర్ రైతు వేదిక ఆవరణలో పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో స్పీకర్ సర్టిఫికెట్లను అందజేశారు.

## పాలిసెట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం టిసాట్ డిజిటల్ లెసన్స్

- **ఏప్రిల్ ఒకటి నుంచి మే 12 వరకు ప్రసారాలు**
- **సీఈవో బొదనపల్లి వేణుగోపాల్ రెడ్డి**

**ముద్ర, శేరిలింగంపల్లి :**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్ ఎంట్రెన్స్ టెస్ట్ కు హాజరయ్యే విద్యార్థులకు ఏప్రిల్ ఒకటి నుంచి టిసాట్ డిజిటల్ లెసన్స్ అందించనుందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మే 13న నిర్వహించే పాలిసెట్ పరీక్ష కోసం రోజుకు రెండు గంటల చొప్పున 42 రోజుల పాటు 84 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు వివరించారు. మ్యాథ్స్, కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ సబ్జెక్టుల్లో అనుభవం కలిగిన లెక్చరర్స్ బోధించిన పాఠ్యాంశాలు విద్య ఛానల్ లో సాయంత్రం ఐదు నుంచి ఏడు గంటల వరకు, రాత్రి తొమ్మిది నుండి 11 గంటల వరకు నిపుణ ఛానల్ లో పునఃప్రసారమౌతాయని తెలిపారు. పదో తరగతి లేదా తత్సమానమైన పరీక్ష పాసైన విద్యార్థులు పాలిసెట్ పరీక్షకు హాజరై మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ ప్రసారాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు పశుసంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చరల్ విశ్వవిద్యాలయాల్లో అర్హత సాధించేందుకు విద్యార్థులకు ఎంట్రన్స్ ఉపయోగపడుతుందన్నారు.



T-SAT

# మసూద్ అజర్ సోదరుడిని లేపేశారా?

- **మొహమ్మద్ తాహిర్ అన్వర్ అనుమానాస్పద మృతి**
- **భారత్ లో పలు ఉగ్రదాడులకు రూపకర్త**
- **జైషే ఉగ్రవాద సంస్థలో కీలకనేత**
- **మరణవార్తను ధృవీకరించిన పాకిస్తాన్**

**ముద్ర, డెస్క్:**

పాకిస్థాన్‌లో ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్‌లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆ సంస్థ అధినేత మసూద్ అజర్ సోదరుడు, కీలక నేతగా భావించే మొహమ్మద్ తాహిర్ అన్వర్ అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం సంచలనంగా మారింది. ఈ ఘటన ఉగ్రవాద వర్గాల్లో కలకలం రేపడంతో పాటు, అంతర్జాతీయ స్థాయిలో కూడా చర్చకు దారి తీసింది.

**అనుమానాస్పద మృతి... ఊహాగానాలకు తావు**

తాహిర్ అన్వర్ మరణించిన విషయాన్ని జైషే మహమ్మద్ సంస్థ తన అధికారిక ఛానెల్ ద్వారా ధృవీకరించింది. పాకిస్థాన్‌లోని బహవల్పూర్ లో ఉన్న 'జామియా మసీదు ఉస్మాన్ వలీ'లో అతని అంత్యక్రియలు నిర్వహించినట్లు వెల్లడించింది. అయితే అతని మరణానికి గల అసలు కారణంపై మాత్రం స్పష్టత ఇవ్వకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిఘా వర్గాలు ఈ ఘటన వెనుక అసలు కారణాలను విశ్లేషిస్తున్నాయి.



**జైషేలో కీలక నేత**

తాహిర్ అన్వర్ కేవలం మసూద్ అజర్ సోదరుడు మాత్రమే కాదు, జైషే సంస్థలో కీలకమైన బాధ్యతలు నిర్వహించిన వ్యక్తి. సంస్థకు అవసరమైన లాజిస్టిక్స్, కార్యకలాపాల సమన్వయం వంటి బాధ్యతలను అతనే చూసుకునేవాడని సమాచారం. భారతదేశంలో జరిగిన పలు ఉగ్రదాడులతో జైషే మహ్మద్‌కు సంబంధాలున్నాయి. ముఖ్యంగా 2001 భారత పార్లమెంట్ పై దాడి, 2016 పఠాన్‌కోట్ దాడి, 2016 ఉరీ దాడి, 2019 పుల్వామా దాడి లాంటి పలు దాడులు భారత్‌లో భద్రతా పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపించాయి. ముఖ్యంగా పుల్వామా దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రగిలించింది.

**ఇది 'రా' పనా.?**

మొహమ్మద్ తాహిర్ అన్వర్ అనుమానాస్పద మరణం ఉగ్రవాద వర్గాల్లో కొత్త చర్చలకు దారి తీసింది. ఇది అంతర్గత విభేదాల ఫలితమా? లేక మరేదైనా నిగూఢ కారణం ఉందా? లేక భారత రా ఏజెంట్లే లేపేశారా? అనే ప్రశ్నలకు సమాధానం ఇంకా రాలేదు. ఈ పరిణామం భవిష్యత్తులో జైషే మహమ్మద్ కార్యకలాపాలపై ఎలా ప్రభావం చూపుతుందో చూడాలి మరి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



సాఫ్ట్‌వేర్ , యాప్స్ అప్డేట్ చేస్తూ ఉండండి
సెక్యూరిటీ ప్యాచెస్ కోసం అప్డేట్స్ చాలా ముఖ్యం.






# ఆరెంజ్ క్యాప్ కోసం పోరు షురూ



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభమైన వెంటనే బ్యాట్స్‌మెన్‌ల మధ్య ఆరెంజ్ క్యాప్ కోసం పోటీ ఆసక్తికరంగా మారింది. జట్లు ఒక్కో మ్యాచ్ ఆడుతుండగానే ఆటగాళ్లు పరుగుల వర్షం కురిపిస్తూ అగ్రస్థానానికి చేరుకోవడానికి పోటీ పడుతున్నారు. ప్రారంభ మ్యాచ్‌ల్లోనే కొన్ని బ్యాట్స్‌మెన్ అద్భుత ప్రదర్శనతో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌ల తర్వాత ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్న ర్యాన్ రికీ పాంటింగ్ అత్యధిక పరుగులు చేసి టాప్‌లో నిలిచాడు. ఒకే మ్యాచ్‌లో 81 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో ముందంజలోకి వచ్చాడు. అతని వెంటనే ఇషాన్ కిషన్ 80 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. రోహిత్ శర్మ 78 పరుగులతో మూడో స్థానంలో నిలవగా, విరాట్ కోహ్లీ కూడా టాప్ 5లో చోటు దక్కించుకున్నాడు. ఇక బౌలర్ల మధ్య కూడా పోటీ అంతే కఠినంగా కనిపిస్తోంది. రొమారియో షెపర్డ్, జాకబ్ డఫీ, శార్దూల్ ఠాకూర్ తలా మూడు వికెట్లు తీసుకుని పర్పుల్ క్యాప్ రేసులో ముందంజలో ఉన్నారు. టోర్నమెంట్ ఇంకా ప్రారంభ దశలోనే ఉండటంతో రాబోయే మ్యాచ్‌ల్లో ఈ పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశం ఉంది. ఈసారి ఆరెంజ్, పర్పుల్ క్యాప్‌లు ఎవరి చేతుల్లో పడతాయో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు

## 'నోట్‌బుక్ సెలబ్రేషన్'పై
# తగ్గేదేలే అంటున్న దిగ్వేష్ రాఠీ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ సీజన్‌లో తన స్పిన్ మ్యాజిక్‌తో పాటు వినూత్నమైన 'నోట్‌బుక్ సెలబ్రేషన్'తో LSG స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ వార్తల్లో నిలిచాడు. వికెట్ తీసిన తర్వాత గాల్లో నోట్‌బుక్ రాస్తున్నట్లుగా చేసే అతని స్టైల్ అభిమానులను బాగా ఆకట్టుకుంటోంది. విమర్శలు వచ్చినా తన స్టైల్ మార్చే ప్రసక్తే లేదని రాఠీ స్పష్టం చేశాడు. తాను ఎవరినీ అవమానించడం లేదని, బ్యాటర్లు సెంచరీ చేసినప్పుడు సెలబ్రేట్ చేసుకుంటే తాను వికెట్ తీసినప్పుడు సెలబ్రేట్ చేయడంలో తప్పేంటని ప్రశ్నించాడు. మైదానంలో తన అగ్రెషన్ తగ్గించుకోనని కూడా ధీమా వ్యక్తం చేశాడు. ఈ విషయంలో తన కెప్టెన్ రిషబ్ పంత్ నుంచి పూర్తి మద్దతు ఉందని రాఠీ తెలిపాడు. అయితే అగ్రెషన్ శృతిమించకుండా జాగ్రత్త పడాలని పంత్ సూచించినట్లు చెప్పాడు. ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో రాఠీ సెలబ్రేషన్‌పై చర్చ కొనసాగుతుండగా, రాబోయే మ్యాచ్‌ల్లో అతని ప్రదర్శనపై అందరి దృష్టి పడింది.



# పొలిటికల్ గ్రౌండ్‌లోకి లియాండర్ పేస్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ తాజాగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆయన భారతీయ జనతా పార్టీలో చేరి తన రాజకీయ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పేస్ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా టెన్నిస్ కోర్టులో దేశం తరపున ఆడానని, ఇకపై రాజకీయాల ద్వారా దేశానికి, ముఖ్యంగా యువతకు సేవ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన 'ఖేలో ఇండియా' వంటి కార్యక్రమాలు క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఢిల్లీ లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, సుకాంత మజుందార్ సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. రాబోయే రోజుల్లో పశ్చిమ బెంగాల్‌లో పార్టీ తరపున విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు పేస్ తెలిపారు. క్రీడారంగంలో ఎన్నో విజయాలు సాధించిన ఆయన ఇప్పుడు రాజకీయ రంగంలో ఎలా రాణిస్తారో చూడాలని విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# ధోనీతో విభేదాలపై జడేజా క్లారిటీ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026 సీజన్ ఈ నెల 28న ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ సీజన్‌లో పలువురు కీలక ఆటగాళ్లు పాత జట్లను వదిలి కొత్త జట్లకు వెళ్లాల్సి వచ్చింది. అందులో రవీంద్ర జడేజా కూడా ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా చెన్నై తరఫున ఆడిన ఆయన ఇప్పుడు రాజస్థాన్ జట్టులోకి వెళ్లడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్ నిర్వహించిన పాతకొత్త ఆటగాళ్ల రీయూనియన్ కార్యక్రమంలో జడేజా, ఎంఎస్ ధోనీ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీంతో వీరిద్దరి మధ్య మళ్లీ కోల్డ్ వార్ మొదలైందనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలపై జడేజా క్లారిటీ ఇచ్చారు. రద్దీ, సాంకేతిక ఇబ్బందుల వల్లే మాట్లాడుకునే అవకాశం రాలేదని, తమ మధ్య ఎలాంటి మనస్పర్ధలు లేవని స్పష్టం చేశారు. ధోనీ తనకు ఎప్పుడూ గురువు, మార్గదర్శి అని చెప్పిన జడేజా, చిన్న విషయాలను పెద్దవి చేయవద్దని అభిమానులను కోరారు



# ఐసీసీ తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో
# భారీ మార్పులు..

## అగ్రస్థానంలో కొత్త స్టార్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**



ఈసారి ఐసీసీ విడుదల చేసిన మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ఆస్ట్రేలియాకు చెందిన యువ బ్యాట్స్‌వుమన్ జార్జియా వోల్ అద్భుతంగా ఎనిమిది స్థానాలు ఎగబాకి ప్రపంచ నంబర్ వన్ బ్యాట్స్‌మన్‌గా అవతరించింది. ఇటీవల వెస్టిండీస్‌పై మెరుపు సెంచరీ సాధించిన తర్వాత ఆమె ర్యాంకింగ్ ఒక్కసారిగా పెరిగినట్లు ఐసీసీ అధికారిక ప్రకటనలో వెల్లడైంది. జార్జియా వోల్ అగ్రస్థానానికి చేరుకోవడంతో ఇప్పటి వరకు నంబర్ వన్‌గా కొనసాగుతున్న బెత్ మూనీ రెండో స్థానానికి పడిపోయింది. అలాగే భారత స్టార్ బ్యాట్స్‌వుమన్ స్మృతి మంధాన కూడా ఒక స్థానం కోల్పోయి మూడో స్థానానికి చేరింది. ఇటీవల జరిగిన టీ20 సిరీస్‌లలో వచ్చిన ఫలితాల ప్రభావం ఈ ర్యాంకింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తున్నట్లు ఐసీసీ తెలిపింది. ఇక టాప్ 10లో మరికొన్ని మార్పులు కూడా చోటుచేసుకున్నాయి. న్యూజిలాండ్‌కు చెందిన అమేలియా కెర్ అద్భుత ప్రదర్శనతో మరో రెండు స్థానాలు ఎగబాకి ముందుకు వచ్చింది. అదే సమయంలో హేలీ మాథ్యూస్, లారా వోల్వార్డ్ వంటి స్టార్ ప్లేయర్లు ఒక్కో స్థానం కిందకు పడిపోయారు. ఈ ర్యాంకింగ్స్‌తో మహిళల టీ20 క్రికెట్‌లో కొత్త తరం ఆటగాళ్లు అగ్రస్థానాన్ని దక్కించుకుంటున్నారని స్పష్టమైంది. టీ20 వరల్డ్ కప్‌కు ముందు ఈ ర్యాంకింగ్స్ మార్పులు అభిమానుల్లో మరింత ఆసక్తి పెంచుతున్నాయి. రాబోయే మ్యాచ్‌లలో ఎవరు అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటారో చూడాల్సి ఉంది

## పాక్ క్రికెటర్ ఫఖర్ జమాన్‌పై
# రెండు మ్యాచ్‌ల నిషేధం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

పీఎస్ఎల్ 2026 సందర్భంగా పాకిస్థాన్ క్రికెట్‌లో పెద్ద వివాదం చెలరేగింది. బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలపై స్టార్ బ్యాట్స్‌మన్ ఫఖర్ జమాన్‌కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు రెండు మ్యాచ్‌ల నిషేధం విధించింది. టోర్నమెంట్ ప్రవర్తనా నియమావళిని లెవెల్ 3 స్థాయిలో ఉల్లంఘించినట్లు పీసీబీ ధృవీకరించింది. మార్చి 29న లాహోర్‌లో లాహోర్ ఖలందర్స్, కరాచీ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. మ్యాచ్ చివరి ఓవర్‌కు ముందు అంపైర్లు లాహోర్ జట్టుకు ఐదు పరుగుల పెనాల్టీ విధించి, బంతిని మార్చాలని నిర్ణయించారు. ఈ సంఘటనకు ఫఖర్ జమాన్ కారణమని అంపైర్లు నివేదించారు. మ్యాచ్ రిఫరీ సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత ఫఖర్‌కు రెండు మ్యాచ్‌ల నిషేధం విధించారు. దీంతో ఏప్రిల్ 3న ముల్తాన్ సుల్తాన్స్‌తో జరిగే మ్యాచ్‌కు, అలాగే ఏప్రిల్ 9న ఇస్లామాబాద్ యునైటెడ్‌తో జరిగే మ్యాచ్‌కు అతను దూరం కానున్నాడు. ఈ నిషేధం లాహోర్ ఖలందర్స్ జట్టుకు పెద్ద దెబ్బగా భావిస్తున్నారు



# మలింగను దాటిన జడేజా..
# ఐపీఎల్‌లో కొత్త మైలురాయి

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026 ప్రారంభంతోనే రికార్డుల పరంపర మొదలైంది. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న రవీంద్ర జడేజా తన తొలి మ్యాచ్‌లోనే కీలక మైలురాయిని అందుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో లసిత్ మలింగను అధిగమించి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. గౌహతిలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో జడేజా అద్భుతంగా బౌలింగ్ చేసి శివమ్ దూబే, సర్ఫరాజ్ ఖాన్‌లను ఔట్ చేశాడు. దీంతో ఐపీఎల్‌లో అతని వికెట్ల సంఖ్య 172కు చేరింది. మలింగ సాధించిన 170 వికెట్ల రికార్డును జడేజా దాటడం విశేషం. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ అద్భుత ప్రదర్శన చేసి చెన్నై సూపర్ కింగ్స్‌ను 8 వికెట్ల తేడాతో ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్కే 127 పరుగులకే పరిమితమైంది. లక్ష్యాన్ని ఛేదించడంలో వైభవ్ సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్‌తో 52 పరుగులు చేయగా, యశస్వి జైస్వాల్ అజేయంగా 38 పరుగులు చేసి జట్టుకు సునాయాస విజయాన్ని అందించాడు. 2008లో రాజస్థాన్ టైటిల్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్న జడేజా, ఇప్పుడు మళ్లీ అదే జట్టుకు ఆడుతూ కొత్త రికార్డు సృష్టించడం అభిమానులను ఆనందపరుస్తోంది. ఐపీఎల్ 2026లో జడేజా నుంచి ఇంకా మంచి ప్రదర్శనలు రావాలని అభిమానులు ఆశిస్తున్నారు



# ఐపీఎల్ మధ్యలో విషాదం..
# బ్రాడ్‌కాస్ట్ ఇంజనీర్ మృతి

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026 మ్యాచ్‌లు కొనసాగుతున్న సమయంలో ఒక విషాదకర ఘటన వెలుగులోకి వచ్చింది. ముంబైలో ఐపీఎల్ మ్యాచ్‌ల కోసం పనిచేస్తున్న ఒక బ్రాడ్‌కాస్ట్ ఇంజనీర్ ఆకస్మికంగా కన్నుమూయడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. బీసీసీఐతో కలిసి ఐపీఎల్ మ్యాచ్‌ల కవరేజ్ కోసం పనిచేస్తున్న బ్రిటిష్ పౌరుడు ఇయాన్ విలియమ్స్ లాంగ్‌ఫోర్డ్ ముంబైలోని ట్రైడెంట్ హోటల్‌లో తన గదిలో మృతిచెందినట్లు సమాచారం. మార్చి 24 నుంచి ఆయన అదే హోటల్‌లో బస చేస్తున్నారని తెలుస్తోంది. ఇటీవల జరిగిన మ్యాచ్ ముగిసిన తర్వాత తన గదికి వెళ్లిన ఆయన నుంచి మరుసటి రోజు ఎటువంటి స్పందన రాకపోవడంతో హోటల్ సిబ్బంది గదిని పరిశీలించారు. మాస్టర్ కీతో గదిని తెరిచి చూడగా ఆయన నేలపై పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే హోటల్ వైద్యుడిని పిలవగా ఆయన మరణించినట్లు ధృవీకరించారు. ఈ ఘటనపై మెరైన్ డ్రైవ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సంఘటనతో ఐపీఎల్ వర్గాల్లో విషాదం నెలకొంది



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.04.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





# ఆద్యంతం వినోదభరితంగా 'రాకాస'

## నిర్మాత కొణిదెల నిహారిక

ముద్ర, సినిమా డెస్క్ :
జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల నిర్మించిన తాజా చిత్రం 'రాకాస' విడుదలకు సిద్ధమైంది. మానస శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, ట్రైలర్, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఏప్రిల్ 3న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడిన నిర్మాత నిహారిక కొణిదెల, దర్శకురాలు మానస శర్మ సినిమా పట్ల ఎంతో అంకితభావంతో పని చేశారని చెప్పారు. యూనిట్ మొత్తం ఎంతో కష్టపడి ఈ సినిమాను తీశామని, ప్రేక్షకులకు పూర్తి వినోదం అందించేలా 'రాకాస' రూపొందించామని తెలిపారు. కొత్త టాలెంట్‌కు అవకాశం ఇవ్వడం తనకు గర్వంగా అనిపిస్తుందని కూడా ఆమె అన్నారు. హీరో సంగీత్ శోభన్ మాట్లాడుతూ ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డామని, ప్రేక్షకులు పెట్టే డబ్బుకి పూర్తి న్యాయం చేసేలా సినిమా ఉంటుందని అన్నారు. హీరోయిన్ నయన్ సారిక కూడా ఈ చిత్రంలో తనకు మంచి పాత్ర దక్కిందని, ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారని చెప్పారు. యూనిట్ సభ్యులంతా ఈ సినిమా విజయంపై నమ్మకం వ్యక్తం చేస్తూ ఏప్రిల్ 3న విడుదలవుతున్న 'రాకాస'ను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

## హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో

# 'కథనార్' ట్రైలర్ సెన్సేషన్

ముద్ర, సినిమా డెస్క్ :
టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి కొంత విరామం తర్వాత మళ్లీ భారీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. స్వీటీ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'కథనార్: ద వైల్డ్ సోర్సెరర్' ట్రైలర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. మలయాళ నటుడు జయసూర్య హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి రోజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీగోకులం మూవీస్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. విడుదలైన ట్రైలర్ చూస్తే ఈ చిత్రం పూర్తిగా ఫాంటసీ ప్రపంచం చుట్టూ తిరిగే కథతో రూపొందిందని స్పష్టమవుతోంది. అద్భుతమైన విజువల్స్, మిస్టరీతో నిండిన సన్నివేశాలు, కొత్త ప్రపంచాన్ని గుర్తు చేసే సెట్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా సినిమాటోగ్రఫీ చాలా గ్రాండ్‌గా కనిపిస్తూ సినిమా స్థాయిని మరింత పెంచింది. ప్రతి ఫ్రేమ్‌లోనూ విజువల్ క్వాలిటీ స్పష్టంగా కనిపిస్తుండటంతో ఇది పెద్ద తెరపై చూడాల్సిన సినిమా అనే భావన కలుగుతోంది. ఇక అనుష్క శెట్టి గతంలో 'అరుంధతి', 'భాగమతి' వంటి చిత్రాలతో ప్రేక్షకులను ఎలా ఆకట్టుకున్నారో, అదే తరహాలో 'కథనార్'లో కూడా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారని ట్రైలర్ సూచిస్తోంది. కేరళ జానపద కథల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రం తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. చాలా కాలం తర్వాత అనుష్కను ఇలాంటి విభిన్నమైన పాత్రలో చూడబోతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి



## బోల్డ్ షిమ్మర్ స్టైల్‌లో

# నిధి హాట్ లుక్

ముద్ర, సినిమా డెస్క్ :
తాజా ఫ్యాషన్ ర్యాంప్ వాక్‌లో నిధి అగర్వాల్ తన బోల్డ్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. గోల్డెన్ షిమ్మర్ అవుట్‌ఫిట్‌లో ఆమె ఇచ్చిన స్టైలిష్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డీప్ నెక్ డిజైన్‌తో పాటు ఫిట్‌గా ఉన్న డ్రెస్ ఆమె లుక్‌ను మరింత గ్లామరస్‌గా మార్చింది. లైట్ పడిన ప్రతి సారి మెరిసే క్రిస్టల్ వర్క్ ఈ అవుట్‌ఫిట్‌కు మరింత హైలైట్‌గా నిలిచింది. సింపుల్ హెయిర్ స్టైల్, స్టైలిష్ ఎక్స్‌ప్రెషన్స్‌తో నిధి ఈ లుక్‌ను చాలా కాన్ఫిడెంట్‌గా క్యారీ చేసింది. బోల్డ్ స్టైల్‌తో పాటు క్లాసీ లుక్ కూడా ఈ అవుట్‌ఫిట్‌లో స్పష్టంగా కనిపించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# బోల్డ్ లుక్‌లో హెబా పటేల్

ముద్ర, సినిమా డెస్క్ :
హెబా పటేల్ షేర్ చేసిన తాజా ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఫిట్ టాప్‌కు అన్‌బటన్ చేసిన జీన్స్‌ను మ్యాచ్ చేస్తూ ఆమె ఇచ్చిన పోజులు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సింపుల్ లుక్‌లోనే బోల్డ్ స్టైల్‌ను చూపిస్తూ హెబా తన స్టైలింగ్‌తో మరోసారి ట్రెండ్ క్రియేట్ చేసింది. ఆమె ఎక్స్‌ప్రెషన్స్, స్టైలిష్ లుక్ ఈ ఫోటోలకు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. ఇక సినిమాల విషయానికి వస్తే గత ఏడాది ఆమె ఐదుకి పైగా సినిమాల్లో కనిపించింది. ఈ ఏడాది ఇప్పటికే 'రేపు ఉదయం 10 గంటలకు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా పెద్దగా సక్సెస్ కాలేదు. ప్రస్తుతం 'ఆద్య' అనే మరో ప్రాజెక్ట్ ఆమె చేతిలో ఉంది. కెరీర్‌లో ఎత్తుపల్లాలు ఉన్నా హెబా పటేల్ మాత్రం వరుసగా సినిమాలు చేస్తూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

# 'బ్రైడ్ సాంగ్'తో రాబోతున్న ఫరియా

ముద్ర, సినిమా డెస్క్ :
తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'గాయపడ్డ సింహం'. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. మే 1న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని చిత్ర యూనిట్ తెలిపింది. అమెరికా వీసా సమస్యల నేపథ్యంలో యువత కథతో క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రమోషన్లలో భాగంగా ఇందులోని 'బ్రైడ్ సాంగ్'ను ఏప్రిల్ 1న సాయంత్రం 6 గంటలకు విడుదల చేయనున్నట్లు పోస్టర్‌లో అబ్దుల్లా ఫరియా ప్రకటించారు.






# 4 రోజుల్లో 3.73 కోట్లు రాబట్టిన 'యూత్'

ముద్ర, సినిమా డెస్క్ :
కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'యూత్' తెలుగులో కూడా మంచి స్పందనను అందుకుంటోంది. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ సినిమాను ఈ2సీ బ్యానర్‌పై హౌస్‌ఫుల్ వినీత్, సందీప్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాకు తెలుగు ప్రేక్షకుల నుంచి కూడా మంచి ఆదరణ లభిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా 3.73 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు సాధించింది. యూత్‌ను ఆకట్టుకునే వినోదంతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌కు నచ్చే ఎమోషన్స్ కూడా ఈ సినిమాలో ఉండటంతో మంచి టాక్ వస్తోంది. మొదటి వారంలో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఇంకా మంచి కలెక్షన్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. మంచి యూత్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా 'యూత్' ప్రేక్షకులను ఆకట్టుకుంటూ థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది.



# నా జీవితానికి మార్గదర్శి రాముడు : రణ్‌బీర్ కపూర్

ముద్ర, సినిమా డెస్క్ :
రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రామాయణ' నుంచి గ్లింప్స్‌ను ఏప్రిల్ 2న విడుదల చేయనున్నారు. తాజాగా లాస్ ఏంజెలెస్‌లోని ఐమాక్స్ థియేటర్‌లో ఈ గ్లింప్స్‌ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ శ్రీరాముడి పాత్ర తన జీవితానికి మార్గదర్శిలాంటిదని చెప్పారు. శ్రీరాముడు కేవలం పురాణ పాత్ర మాత్రమే కాదు, కోట్లాది మంది ప్రజల ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. కరుణ, ధైర్యం, నీతి, క్షమాగుణాలకు ప్రతీకగా నిలిచిన పాత్రను పోషించడం తన అదృష్టంగా భావిస్తున్నానని రణ్‌బీర్ తెలిపారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళికి విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

# హోంబలేను పక్కన పెట్టేశాడా రిషబ్ శెట్టి?

ముద్ర, సినిమా డెస్క్ :
కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి తీసుకున్న తాజా నిర్ణయం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వరుసగా పలువురు నటీనటులను అన్‌ఫాలో చేసిన ఆయన, 'కాంతార' సినిమాతో తనకు భారీ గుర్తింపు తీసుకొచ్చిన హోంబలే ఫిల్మ్స్ సంస్థను కూడా అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇదే కాకుండా ఆ సినిమాలో హీరోయిన్‌గా నటించిన రుక్మిణి వసంత్‌తో పాటు మరికొందరు ఇండస్ట్రీ ప్రముఖులను కూడా ఆయన అన్‌ఫాలో చేసినట్లు సమాచారం. దీంతో హోంబలే ఫిల్మ్స్‌తో రిషబ్ శెట్టికి ఏమైనా విభేదాలు ఉన్నాయా అనే చర్చలు ఫిలింనగర్ వర్గాల్లో మొదలయ్యాయి. అయితే ఈ విషయంపై రిషబ్ శెట్టి లేదా హోంబలే ఫిల్మ్స్ నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ప్రస్తుతం ఆయన కొత్త సినిమాలతో బిజీగా ఉండటంతో ఈ నిర్ణయం వెనుక అసలు కారణం ఏంటన్నది మాత్రం సస్పెన్స్‌గానే మారింది.



# ఏప్రిల్ 10న 'పళ్లిచట్టంబి' గ్రాండ్ రిలీజ్

ముద్ర, సినిమా డెస్క్ :
మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమైంది. వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై రూపొందిన ఈ సినిమాకు డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించారు. కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హైదరాబాద్‌లో ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన టొవినో థామస్, ఇది 1950ల నేపథ్యంతో సాగే ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని తెలిపారు. దర్శకుడు డిజో జోస్ ఆంటోనీ ఈ చిత్రాన్ని అందరికీ కనెక్ట్ అయ్యేలా తెరకెక్కించారని అన్నారు. హీరోయిన్ కయదు లోహర్ కూడా తనకు ఇది ప్రత్యేకమైన సినిమా అని చెప్పింది. ఏప్రిల్ 10న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానున్న 'పళ్లిచట్టంబి' అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ నమ్మకం వ్యక్తం చేసింది





Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com